మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 10-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 222 Issue: 222


10 ఫిబ్రవరి 2026 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:48 సూర్యాస్తమయం - సా. 6:12 తిథి అష్టమి ఉ. 7:27 వరకు తరువాత నవమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం విశాఖ ఉ. 7:49 వరకు తరువాత అనురాధ యోగం ధ్రువ రా. 1:38ం వరకు కరణం కౌలవ ఉ. 7:27 వరకు తైతుల రా. 8:43 వరకు వర్జ్యం మ. 12:25 నుండి మ. 2:13 వరకు దుర్ముహూర్తం ఉ. 9:05 నుండి ఉ. 9:50 వరకు రా. 11:14 నుండి రా. 12:04 వరకు రాహుకాలం మ. 3:21 నుండి సా. 4:46 వరకు యమగండం ఉ. 9:39 నుండి ఉ. 11:05 వరకు గుళికాకాలం మ. 12:30 నుండి మ. 1:55 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:12 నుండి ఉ. 6:00 వరకు అమృత ఘడియలు రా. 11:11 నుండి రా. 12:59 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com


## కారు లోన్‌పై వడ్డీ తగ్గింపు

### బ్యాంక్ ఆఫ్ బరోడా నిర్ణయం

కారు లోన్ తీసుకున్న వారికి బ్యాంక్ ఆఫ్ బరోడా శుభవార్త చెప్పింది. ఈ పబ్లిక్ సెక్టార్ బ్యాంక్ కారు రుణాల వడ్డీ రేట్లను 30 బేసిస్ పాయింట్ల మేర తగ్గించినట్లు తెలిపింది. దీంతో బీఓబీలో కారు లోన్ తీసుకున్న వారికి నెల వారీ వాయిదా భారం తగ్గనుంది.



న్యూఢిల్లీ: నెల నెలా కొంత డబ్బు ఆదా కానుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా వెహికల్ లోన్లపై ఫ్లోటింగ్ రేట్ వడ్డీని 30 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ప్రారంభ వడ్డీ రేటు 7.90 శాతం నుంచి 7.60 శాతానికి తగ్గించింది. అలాగే ఫిక్స్‌డ్ వడ్డీ రేటు 8.50 శాతం నుంచి తరువాయి 2 వ పేజీలో...

## హోండా కార్లపై 2 లక్షలు తగ్గింపు

### ఫిబ్రవరి 28 వరకు అవకాశం



న్యూఢిల్లీ: హోండా ఇండియా ఫిబ్రవరి నెల సందర్భంగా కస్టమర్లకు భారీ ఆఫర్ ప్రకటించింది. సెడాన్, ఎస్‌యూవీ కార్లపై భారీగా ఆదా చేసుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. రూ.57 వేల నుంచి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు తగ్గింపు ఆఫర్ అందిస్తోంది. కాంపాక్ట్ సెడాన్ కారు, 5 స్టార్ సెఫ్టీ రేటింగ్ గల హోండా అమేజ్ కార్లపై ప్రస్తుతం బంపర్ ఆఫర్ ఉంది. ఈ కారుపై గరిష్ఠంగా రూ.57 వేల వరకు తగ్గింపు పొందవచ్చని కంపెనీ తెలిపింది. హోండా ఎలవేట్ కారుపై గరిష్ఠంగా రూ.1,48,000 వరకు, 5వ జనరేషన్ హోండా సిటీకి రూ.1,27,700 వరకు, హోండా సిటీ ఈ-హెచ్ఈవీ కారుపై రూ.1,97,000 వరకు, హోండా అమేజ్ సెకండ్ జనరేషన్‌పై రూ.68 వేల వరకు తగ్గింపు పొందవచ్చని పేర్కొంది.



## ఆడుతాం!

### భారత్‌తో మ్యాచ్‌పై పాక్ యూటర్న్

#### షెడ్యూల్ ప్రకారమే 15న మ్యాచ్

టీ20 ప్రపంచకప్-2026లో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్‌తో మ్యాచ్‌పై పాకిస్తాన్ జట్టు యూటర్న్ తీసుకుంది. మ్యాచ్‌కు రెడీ అని ఐసీసీకి సమాచారం ఇచ్చినట్లు సమాచారం. దీంతో షెడ్యూల్ ప్రకారమే ఈనెల 15వ తేదీన కొలంబో మైదానం వేదికగా మ్యాచ్ జరుగనుంది. టీ20 ప్రపంచకప్‌లో భారత్ - పాకిస్తాన్ మధ్య మ్యాచ్ జరగాలంటే తమకు కొన్ని డిమాండ్లు ఉన్నాయని పాక్ తెలిపింది. ఇందులో మొదటిది.. టీ20 ప్రపంచ కప్ 2026 నుంచి బంగ్లాదేశ్ బహిష్కరణకు -2 వ పేజీలో...

## రో-కోకు డిమోషన్

సెంట్రల్ కాంట్రాక్ట్స్ ప్రకటించిన బీసీసీఐ

ఇషాన్ కిషన్, మహ్మద్ షమీకి షాక్



## జమిలీ ఎన్నికలు 2029లో

### అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు

#### మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కీలక వ్యక్తి అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో విలేకరులతో ఆయన ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ప్రభాకర్‌రావు 20 నెలలు విదేశాల్లో ఉన్నారని చెప్పారు. ఆయన్ను భారత్‌కు తీసుకురావడానికి కేంద్రం సహకరించలేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభాకర్‌రావును స్వదేశానికి తీసుకొచ్చామని తెలిపారు. ఆ తర్వాతే కేసు విచారణ వేగవంతమైందన్నారు. జనాభా ప్రాతిపదికన డీమిలిటేషన్‌తో మనకే నష్టం వాటిల్లుతుందని చెప్పారు.

జూబ్లీహిల్స్/హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. అది ఏపీ అంశమని అన్నారు. తెలంగాణలోని అన్ని ఆలయాల్లో విజయ డెయిరీ నెయ్యిని వాడుతున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ గురించి మాట్లాడుతూ.. జైలుకు వెళ్తే సీఎం అవుదామని.. హరీశ్, కేటీఆర్ ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు. అటు.. మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొందని రేవంత్ అన్నారు. భవిష్యత్తును ఆలోచించుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ.. తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా? అని ప్రశ్నించారు. 'పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని ప్రధాని మోదీనే స్వయంగా హామీ ఇచ్చారు. వాటి గురించి చెప్పట్లేదు.. కానీ, మోదీని చూసి ఓటేయాలని బీజేపీ నేతలు తరువాయి 2 వ పేజీలో...



## రెడ్డి అయినా, రావు అయినా మా దగ్గరికి రావాల్సిందే

### ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్‌లో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత, గత ముఖ్యమంత్రులను ఉద్దేశించి.. ముఖ్యమంత్రుల వద్దకు తాము వెళ్లం అని, వాళ్లే తమ వద్దకు వస్తారని పేర్కొన్నారు. అది రెడ్డి అయినా.. రావు అయినా తమ దగ్గరికి రావాల్సిందేనని అన్నారు.

కరీంనగర్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): తాము ముఖ్యమంత్రుల దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదని.. పనులు కావాలన్నా, అధికారం కావాలన్నా సీఎంలే తమ వద్దకు రావాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. తమ సపోర్ట్ లేకుండా రాజకీయాలు చేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఎంఐఎం పార్టీ మద్దతు అనేది రాష్ట్రంలో కేవలం ఒక ప్రాంతానికి -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,791 |
| వెండి (గ్రాము): | రూ.300 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,091 |

## ఫ్రస్ట్రేషన్‌లో రేవంత్

### ఓటమి భయం.. బీజేపీపై అడ్డగోలు మాటలు.. కేంద్ర మంత్రి బండి సంజయ్

మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్‌కు ముందే కాంగ్రెస్ ఓటమి ఖాయమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జోస్యం చెప్పారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, మున్సిపాలిటీలకు నిధులివ్వకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ప్రజలంతా డిసైడ్ అయ్యారని అన్నారు. ఇంటెలిజెన్స్, సర్వేల ద్వారా సమాచారం తెప్పించుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఓటమి ఖాయమనే ఫ్రస్టేషన్‌తో బీజేపీపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు.



కరీంనగర్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): బీఆర్ఎస్‌పై కోపంతో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే.. రెండేళ్లలో కాంగ్రెస్ బండారం బయటపడిందన్నారు. ఆ పార్టీ సంగతి అర్థమైంది కాబట్టే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ప్రజలంతా డిసైడ్ అయ్యారని చెప్పారు. ఈ విషయం తెలిసే సీఎం ఫ్రస్ట్రేషన్‌కు లోనై బీజేపీపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఒవైసీని తాను దేవుడిలా తలుస్తున్నట్లు తరువాయి 2 వ పేజీలో...



## బూతుల సీఎంకు బూత్‌లో బుద్ధి

### మున్సిపల్ ఓటర్లకు కేటీఆర్ పిలుపు

#### కేసీఆర్‌ను తిట్టినోళ్లు వదిలిపెట్టం.. ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ వార్నింగ్

రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రెండేళ్ల తర్వాత ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమని హెచ్చరించారు. తమ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. మహబూబాబాద్‌లో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మహబూబాబాద్ , ఫిబ్రవరి 9 (ఈవార్తలు): ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. హామీలు అమలు చేయాలని బరాబర్ అడుగుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ వెంటపడుతూనే ఉంటామని తెలిపారు. అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల్లో గెలిస్తే కల్యాణలక్ష్మీ డబ్బులతో పాటు తులం బంగారం ఇస్తానని అబద్ధాలు చెప్పిండని అన్నారు. కానీ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



తమను ఆప్యాయంగా చూసే వాళ్లను పిల్లులు ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటాయని తాజా అధ్యయనంలో తేలింది. వాళ్లతో గడిపిన క్షణాలను ఏళ్ల పాటు మెదడులో దాచుకుంటాయట.

## 54 వేల కోట్లంటే మాటలా?

### చిన్న రాష్ట్రాల బడ్జెట్ కన్నా ఎక్కువ.. డిజిటల్ స్కాంలు దోపిడీనే

### డిజిటల్ అరెస్టులు హేయం.. కేంద్రం-ఆర్బీఐ సమన్వయం అవసరం

### ఎస్‌వోపీ అమలు చేయాలి.. సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, సైబర్ మోసాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై జరిగిన విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజల డబ్బు రక్షణలో బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేసింది. అనుమానాస్పద లావాదేవీలు జరిగితే ఖాతాదారులకు తక్షణమే అలర్ట్ ఇవ్వాల్సిందేనని సుప్రీంకోర్టు తరువాయి 2 వ పేజీలో...




## పుర ప్రచారం బంద్

### 48 గంటలు సైలెంట్

#### 11న ఎన్నికలు, 13న ఫలితాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు ఎన్నికల ప్రచారానికి గడువు ముగిసింది. పోలింగ్‌కు ముందు 48 గంటల ప్రచార నిషేధం అమల్లోకి వచ్చింది. మున్సిపల్ ఎన్నికల పరిధిలో అన్ని రకాల ప్రచారాలపై తరువాయి 2 వ పేజీలో...



## లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాసం

### తీర్మానానికి విపక్షాల యోచన

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో సోమవారం అధికార, ప్రతిపక్షాల మాటల యుద్ధంతో ఉభయ సభలు తరుచూ వాయిదా పడుతూ నడుస్తున్నాయి. సభలో తమను మాట్లాడనివ్వడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చేందుకు విపక్షాలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

న్యూఢిల్లీ: స్పీకర్ ఓం బిర్లా టార్గెట్‌గా విపక్షాలు పావులు కదుపుతుండటంతో పార్లమెంట్ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే కనీసం 50 మంది ఎంపీల మద్దతు అవసరం. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో విపక్షాలకు తగినంత బలం ఉండటంతో, స్పీకర్‌కు నోటీసు ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నోటీసు ఇచ్చిన 14 రోజుల తర్వాత సభలో దీనిపై చర్చ - 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
10.2.2026

మేషం: నూతన ఋణాలు చేయవలసి వస్తుంది. దూర ప్రయాణం సూచనలు ఉన్నవి. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన నిరాశ కలిగిస్తుంది. ఆర్థికంగా కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. దైవచింతన కలుగుతుంది.

వృషభం: వ్యాపారపరంగా భాగస్తులతో మాటపట్టింపులు ఉంటాయి. కుటుంబ సభ్యులతో ఊహించిన వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో మరింత శ్రమ పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు నిరాశ పరుస్తాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు మందగిస్తాయి. సంతానం విద్యా విషయాలు అంతంత మాత్రంగా ఉంటాయి.

మిధునం: చిన్ననాటి మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధన లాభం కలుగుతుంది. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా సాగుతాయి. వ్యాపార ఉద్యోగాలలో ఆశించిన మార్పులు చోటుచేసుకుంటాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

కర్కాటకం: చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ధన పరంగా ఇతరులకు మాట ఇవ్వడం మంచిది కాదు. కొన్ని వ్యవహారాలలో మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి సమస్యలు కలుగుతాయి.

సింహం: అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు. ఆత్మీయులు నుండి ఊహించని ఆహ్వానాలు పొందుతారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఆర్థికంగా పురోగతి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఊహించని లాభాలు అందుతాయి. ఉద్యోగమున మీ మాటకు విలువ పెరుగుతుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

కన్య: కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలో స్థిరత్వం ఉండదు. వ్యాపారాలలో పెట్టుబడులకు చేసే ప్రయత్నాలు మందగిస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు కలుగుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు కలిసిరావు. ఉద్యోగస్తులకు రావలసిన అవకాశాలు చేజారుతాయి. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది.

తుల: సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. సోదరుల నుంచి ఊహించని సహాయం అందుతుంది. నిరుద్యోగులకు అప్రయత్నంగా నూతన అవకాశాలు లభిస్తాయి. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తిచేస్తారు. వ్యాపారాల్లో లాభాలు పొందుతారు. ఉద్యోగ వాతావరణం మరింత అనుకూలిస్తుంది. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.

వృశ్చికం: పాత ఋణాలు తీర్చగలుగుతారు. కుటుంబ వాతావరణం సానుకూలంగా ఉంటుంది. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. నూతన వస్తు వస్త్ర లాభాలు పొందుతారు. పాత మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలు విస్తరిస్తారు. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. నిరుద్యోగులకు పెద్దల సహాయం పొందుతారు.

ధనస్సు: అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. వ్యాపార వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. ఉద్యోగులకు జీతభత్యాల విషయంలో మరోసారి నిరాశ తప్పదు.

మకరం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార వ్యవహారాలలో స్థిర నిర్ణయాలు చేయలేరు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనులు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. నిరుద్యోగులకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

కుంభం: కుటుంబ వ్యవహారాలలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. సన్నిహితుల నుంచి శుభవార్తలు అందుతాయి. నూతన వాహనాలు కొనుగోలు చేస్తారు. దైవసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో మరింత పురోగతి కలుగుతుంది.

మీనం: రాజకీయవర్గాల నుండి ఆహ్వానాలు అందుతాయి. దూరపు బంధువుల కలయికతో ఆనందం కలుగుతుంది. మిత్రులతో వివాదాలు పరిష్కరించుకుంటారు. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. వ్యాపార ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా పని చేసి లాభాలు అందుకుంటారు. సంతాన వివాహ ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

# జమిలీ ఎన్నికలు 2029లో..

మొదటి పేజీ తరువాయి

అడుగుతున్నారు. వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి తిరిగిస్తామని గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మి ఆ పార్టీకి చెందిన 50 మందిని కార్పొరేటర్లుగా గెలిపించారు. ఎన్నికలయ్యాక అడిగితే.. వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారు. తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చామని బీజేపీ నేతలు చెబుతున్నారు. దీనిపై సీఎస్‌ను వివరణ అడిగితే.. మనం రూపాయి చెల్లిస్తే.. కేంద్రం 42 పైసలు ఇస్తోందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు బీజేపీ తీవ్ర అన్యాయం చేస్తోంది. బిహార్ ఒక్క రూపాయి పన్ను చెల్లిస్తే.. రూ.6.16 కేంద్రం ఇస్తోంది. తెలంగాణకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఏ రోజైనా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారా? మనకు అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదు. మనం చెల్లించిన నిధులు తిరిగిస్తే చాలు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి. తెలంగాణకు వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన సెమీకండక్టర్ ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి.. ఏపీకి తరలించారు. ఇప్పుడు మోదీని చూసి ఓటేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారు. అసలు మున్సిపల్ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం? బీజేపీ నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ. ఆయన పేరు లేకుండా ఆ నేతల ప్రచారం ఉండదు. మత రాజకీయాల ద్వారా బీజేపీ రాజకీయ మనుగడ సాగిస్తోంది' అని ఆరోపించారు.






# మా దగ్గరికి రావాల్సిందే

మొదటి పేజీ తరువాయి

మాత్రమే పరిమితం కాదని పేర్కొన్న అక్బరుద్దీన్ ఓవైసీ.. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే శక్తి తమ పార్టీకి ఉందని తెలిపారు. ఇక కొన్ని నెలల క్రితం జరిగిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో తమ మద్దతు లేకుండానే కాంగ్రెస్ పార్టీ గెలిచిందా అని అక్బరుద్దీన్ ఓవైసీ ప్రశ్నించారు. కాంగ్రెస్ సాధించిన విజయంలో ఎంఐఎం పాత్ర కీలకమని.. దాన్ని హస్తం పార్టీ నేతలు మర్చిపోకూడదని పరోక్షంగా తీవ్ర హెచ్చరికలు చేశారు. తమ ఎంఐఎం పార్టీ అవసరం కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ ఉంటుందనే విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ.. ఎంఐఎం బ్రదర్స్ (అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీ) సత్తా ఏంటో చూపిస్తామని స్పష్టం చేశారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను గుర్తు చేసిన అక్బరుద్దీన్ ఒవైసీ.. రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ ఎంఐఎం పార్టీ కింగ్ మేకర్‌గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 11వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా అద్భుత ప్రతిభ కనబరుస్తారని పేర్కొన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో తమ పార్టీ బలం ఏంటో ప్రత్యర్థులకు చూపిస్తామని ఎంఐఎం కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి.. అత్యధిక వార్డులను దక్కించుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అక్బరుద్దీన్ కామెంట్స్‌పై మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. జూబ్లీ హిల్స్‌లో తమ సపోర్ట్ వల్లే కాంగ్రెస్ గెలిచిందన్న అక్బరుద్దీన్ స్టేట్మెంట్‌పై స్పందించారు.

## కారు లోన్‌పై వడ్డీ తగ్గింపు

మొదటి పేజీ తరువాయి

మొదలవుతోంది. అలాగే కొత్తగా కారు కొనుగోలు చేసే వారికి సైతం ఈ ఫ్లోటింగ్ రేటు 7.60 శాతం వర్తిస్తుందని బ్యాంక్ తెలిపింది. దీంతో ఇప్పటికే కొన్నవారితో పాటు కొత్తగా కారు కొనేవారికీ ఈఎంఐల భారం తగ్గనుంది. అలాగే ఫ్లోటింగ్ రేటుపై లోన్ తీసుకుంటే ప్రీపేమెంట్ లేదా పార్ట్ పేమెంట్ చేస్తే ఎలాంటి ఛార్జీలు విధించడం లేదని బ్యాంక్ తెలిపింది. అలాగే ఈ బ్యాంకు రోజు వారీ తగ్గిన బ్యాలెన్స్ ఆధారంగానే వడ్డీ లెక్కిస్తోంది. దీంతో రుణ గ్రహీతలపై భారం తగ్గుతుంది.

## ఆడుతాం!

మొదటి పేజీ తరువాయి

గురైన నేపథ్యంలో ఆ బోర్డుపై ఫైన్ వేయకూడదని పాకిస్తాన్ కోరడం, జరిగే అండర్-19 వరల్డ్ కప్ బంగ్లాదేశ్‌లో జరిగేలా చూడాలని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు కోరినట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు డిమాండ్లకు ఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కూడా వార్తలు వచ్చాయి. కానీ ఇండియా వర్సెస్ పాకిస్తాన్ ద్వైపాక్షిక సిరీస్ ప్రతిపాదనను ఐసీసీ రిజెక్ట్ చేసినట్టు సమాచారం. ఇండియా, పాక్, బంగ్లాదేశ్ మధ్య ట్రై సిరీస్ పెట్టాలని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు కోరగా.. దాన్నీ రిజెక్ట్ చేసింది. బంగ్లాదేశ్‌లో ఇండియా పర్యటించడాన్నీ ఆమోదించలేదు. ఐదు డిమాండ్లకు గాను 3 డిమాండ్లకు ఐసీసీ ఒప్పుకోలేదు.

# 54 వేల కోట్లంటే మాటలా?

మొదటి పేజీ తరువాయి

ఆదేశించింది. అకస్మాత్తుగా భారీ మొత్తాల లావాదేవీలు జరిగితే బ్యాంకులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించింది. అవసరమైతే ఆ లావాదేవీలపై తాత్కాలికంగా హోల్డ్ పెట్టే అధికారం బ్యాంకులకు ఉండాలని స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లలో ప్రధానంగా వృద్ధులు, సాధారణ ఖాతాదారులే బాధితులవుతున్నారని పేర్కొంది సుప్రీంకోర్టు.. ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ ద్వారా భయపెట్టి డబ్బులు దోచుకుంటున్న ఘటనలు అత్యంత తీవ్రమైనవిగా అభివర్ణించింది. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించేందుకు ఏఐ, ఆధునిక టెక్నాలజీని బ్యాంకులు వినియోగించాలి అని ధర్మాసనం సూచించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూపొందించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీ) ను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. సైబర్ మోసాల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐ, బ్యాంకులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇది కేవలం ఆర్థిక నేరం మాత్రమే కాకుండా, ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే తీవ్రమైన సమస్యగా అభివర్ణించింది. ఇక, హోం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, ఏప్రిల్ 2021 నుంచి



నవంబర్ 2025 వరకు దాదాపు రూ.52,000 కోట్లకు పైగా సైబర్ మోసాలు జరిగాయి. ఈ మొత్తం అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌ను మించిపోవడం గమనార్హం. ఈ స్థాయిలో మోసాలు జరగడం దేశ ఆర్థిక భద్రతకు పెద్ద ముప్పుగా మారిందని కోర్టు వ్యాఖ్యానించింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లను కట్టడి చేయడంలో నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజల సొమ్ము రక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.



## లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాసం

మొదటి పేజీ తరువాయి

జరగాల్సి ఉంటుంది. రాజ్యాంగంలోని 94(సి) అధికరణం ప్రకారం స్పీకర్‌ను తొలగించే ప్రక్రియను చేపట్టాలని విపక్ష సభ్యులు నిర్ణయించారు. సభలో చైనా సరిహద్దు వివాదంపై చర్చ జరుగుతుండగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ఆర్మీ జనరల్ మనోజ్ ముకుంద్ నరవానే రాసిన పుస్తకంలోని సున్నితమైన అంశాలను రాహుల్ ప్రస్తావించే ప్రయత్నం చేశారు. అయితే, దీనిపై స్పీకర్ ఓం బిర్లా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ మాట్లాడుతుండగానే ఆయన మైక్ కట్ చేయడంతో విపక్షాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. స్పీకర్ తీరుకు నిరసనగా ప్రతిపక్ష సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి నినాదాలు చేశారు. ఈ క్రమంలో సభకు ఆటంకం కలిగిస్తున్నారనే కారణంతో ఏకంగా 8 మంది సభ్యులను స్పీకర్ సస్పెండ్ చేశారు. ఇది విపక్షాల ఆగ్రహాన్ని మరింత పెంచింది. స్పీకర్ కేవలం అధికార పక్షానికే అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష గొంతు నొక్కేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

## ఫ్రస్టేషన్‌లో రేవంత్

మొదటి పేజీ తరువాయి

సీఎం చెప్పడంపై తనదైన శైలిలో బదులిచ్చారు. 'సీఎం, ఒవైసీ మాట్లాడుతున్న స్క్రిప్ట్ ఒకటే. మొన్న ఒవైసీ కరీంనగర్ వచ్చి బండి సంజయ్‌కు తన భార్య కంటే నన్నే ఎక్కువ ఇష్టపడతారని చెప్పారు. ఇవాళ సీఎం కూడా బండి సంజయ్ ఒవైసీని దేవుడిలా చూస్తారని చెప్పారు. బహుశా ఇద్దరి స్క్రిప్ట్ దారుస్సలాంలోనో లేక గాంధీభవన్‌లో ప్రిపేర్ అవుతున్నట్లుంది. అందుకే ఇద్దరూ ఒక్కటే మాట్లాడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో సీఎం తన చేతగానితనాన్ని ఇతరులపై నెట్టడం అలవాటైందని ఎద్దేవా చేశారు. 'సుప్రీంకోర్టులో సరైన వాదనలు విన్పించే దమ్ములేదు. సీఎంగా రేవంత్ ఉండగానే కదా ప్రభాకర్ రావు విదేశాలకు పారిపోయింది. మరి పారిపోతుంటే ఏం చేశారు? తప్పించుకోవడానికి ఇవన్నీ డ్రామాలాడుతున్నారు. సీఎంను అడుగుతున్నా.. నాకు చేతగాదు, నాకు ఆవేశం లేదు. రోషం, పౌరుషం లేదని, కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము అసలే లేదని కేంద్రానికి లేఖ రాయండి. అప్పుడు మేం ఏం చేస్తారో మీరే చూస్తారు' అని బదులిచ్చారు.

## పుర ప్రచారం బంద్

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల సంఘం నిషేధం విధించింది. ర్యాలీలు, సభలు, ఊరేగింపులకు ఎలాంటి అనుమతి లేదని ఈసీ స్పష్టం చేసింది. అంతే కాదు.. టీవీ, సినిమా, మ్యూజిక్ షోల ద్వారా కూడా ప్రచారం చేయకూడదని రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్ ప్రచారాలపై కూడా ఆంక్షలు విధించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా పడుతుందని ఈసీ హెచ్చరించింది. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిబంధనలు పాటించాలని ఆదేశించింది. కాగా, ఈ నెల 11న మున్సిపల్ ఎన్నికలు జరగనుండగా, 13న ఫలితాలు వెలువడనున్నాయి. మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగనున్నాయి. 12,993 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. 52.43 లక్షల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుంటారు.



# బూతుల సీఎంకు బూత్‌లో బుద్ధి

మొదటి పేజీ తరువాయి

ఇప్పుడు ముఖం బాగోలేక అద్దం పగులగొట్టినట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఉన్నప్పుడు డిసెంబర్‌లోనే రైతుబంధు పడేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చినా రైతుబంధు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ తెలిపారు. నువ్వు పెట్టినవా తీసేయడానికి.. రెండేళ్లలో ఈ పొట్టోడు ఏం పీకిండని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే నీ వీపు చింతపండు చేస్తారని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాను తెచ్చింది అభివృద్ధి చేసింది కేసీఆర్ అని తెలిపారు. సింగరేణి కాంట్రాక్టులను రేవంత్ రెడ్డి తన బామ్మర్దికి కట్టబెట్టిండని పేర్కొన్నారు. బొగ్గు కుంభకోణం బయటపెట్టామని ఫేక్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఓటుకు నోటు కేసులో ఆధారాలు ఉండకూడదని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో నిప్పు పెట్టి తగులబెట్టారని మండిపడ్డారు. తెలంగాణను ఆగం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని గల్లా పట్టుకుని అడగండని ఓటర్లకు పిలుపునిచ్చారు. తులం బంగారం ఎప్పుడిస్తావని అడగాలన్నారు. రేవంత్ రెడ్డికి ఓటుతోనే కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. బూతుల ముఖ్యమంత్రికి పోలింగ్ బూత్‌లోనే బుద్ధి చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అన్ని వార్డుల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.





# కాంగ్రెస్‌కు ఓటేస్తు మళ్లా గోసపడ్తం

**సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి రోడ్ షో**

సూర్యాపేట, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): మాయ మాటలు నమ్మి మరోసారి కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మరింత గోస పడుతమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో పట్టణమంతా గులాబీమయంగా మారింది. తాళ్లగడ్డ నుంచి ప్రారంభమైన రోడ్ షో కోర్టు చౌరస్తా, పూల సెంటర్, పి ఎస్ ఆర్ చౌరస్తా, రాఘవ ప్లాజా, వాణిజ్య భవన్ సెంటర్, శంకర్ విలాస్, గాంధీ విగ్రహం, కొత్త బస్టాండ్ వరకు కొనసాగింది. అక్కడే ఏర్పాటు చేసిన వేదికపై మాజీ మంత్రి ప్రసంగించారు. కేసీఆర్ అన్నట్టుగానే మళ్లీ 2014కు ముందు రోజులొచ్చినయన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనతో ప్రజలకేం లాభం జరిగిందో అందరూ ఆలోచన చేయాలన్నారు. సీఎం, ఆయన మంత్రి వర్గమంతా దోచుకునే పనిలో పడ్డరని, మంత్రుల మధ్య సఖ్యత లేక ఒకరి బండారం ఒకరు బయట పెట్టుకుంటున్నట్లు తెలిపారు. వాళ్లల్లో పంపకాల పంచాయితే కాదు.. రాసలీలల పంచాయితీలు పెట్టుకోవడం మరీ నీచం. ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారులపై కూడా అబండాలు వేస్తున్నారని, అడ్డు అదుపులేని అరాచకాలతో రాక్షసానందం పొందుతున్నరని దుయ్యబట్టారు. సూర్యాపేటకు మంజూరైనా నిధులు వెనక్కి పంపిన దుర్మారం కాంగ్రెస్ ప్రభుత్వానిదేన్నారు. స్పోట్స్ స్కూల్, స్టేడియం ఆధునీకరణకు రూ.25 కోట్లు, మహిళా పాలిటెక్నిక్ కళాశాల, హాస్టల్ భవనాలకు రూ.25 కోట్లు. భానుపూరి కళా భారతి ఏర్పాటుకు రూ.50 కోట్లు. సీఎం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.50 కోట్లు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు రూ.25 కోట్లు ఇలా కోట్లాది రూపాయలను వెనక్కి పంపిన పాపం కాంగ్రెస్ ది అన్నారు. ప్రజల పట్ల, అభివృద్ధి పట్ల కాంగ్రెస్ నాయకులకు ఎంత సోయి ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చున్నారు. మార్పు తెస్తామన్న కాంగ్రెస్ 2014 కు ముందున్న మార్పు మాత్రం తెచ్చిందన్నారు. వాళ్లు పెంచిపోసించేది దోమలు, పందులు, రౌడీయిజమే అన్నారు. 6 గ్యారెంటీలు, 420 హామీలు అమలవుతాయానే నమ్మకం పోయిందన్నారు. అరాచక కాంగ్రెస్ ను నమ్మి అభివృద్ధి చేసే కేసీఆర్‌ను వదులుకున్నరన్నారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఓటేస్తే ఒరిగిందేమి లేదని ప్రజలు తెలుసుకున్నరన్నారు. కాంగ్రెస్ అంటే కరువు, కష్టాలే అని ప్రజలకు అర్థమైందన్నారు. అభివృద్ధి కుంటుపడింది, కనీసం చెట్లకు నీళ్లుపొసే దిక్కులేదు. అరాచక కాంగ్రెస్ కు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మరోమారు మోసపోకుండా ఓటు అనే ఆయుధంతో సరైన సమాధానం చెప్పాలన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు సరైన బుద్ది చెప్పింద్రు. సూర్యాపేట ప్రజలు చాలా చైతన్యవంతులు. అన్ని వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి మరొమారు చైతన్యాన్ని చాటాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. అందుకు మీ చేతిలో ఉన్న ఓటే సరైన ఆయుధం అని, కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించాలని పేర్కొన్నారు.

# పవన్ పెద్ద ఈగోయిస్ట్

**కొండగట్టుకు టీటీడీ డబ్బులు**

**తమవేనని డప్పు కొట్టుకుంటున్నరు.. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి.. జడ్చర్ల ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత అనిరుధ్ రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. పవన్ కళ్యాణ్ పెద్ద ఈగోయిస్ట్ అని ఆరోపించారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున ప్రచారం చేసినా.. కనీసం డిపాజిట్లు కూడా రావని అర్థమై.. ఈనెల 7, 8వ తేదీల్లో ప్రచారం చేస్తానని చెప్పి.. ఆ తర్వాత తన పర్యటనను రద్దు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌తోపాటు.. ఎన్డీఏ కూటమి నేతలపైనా అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్‌కు ప్రొడ్యూసర్ ఏపీ సీఎం చంద్రబాబు అని.. కో ప్రొడ్యూసర్ ఏపీ మంత్రి నారా లోకేష్ అని.. కొత్త ప్రొడ్యూసర్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అని ఆరోపించారు. జనసేన పార్టీ ఆంధ్రా పార్టీ అని.. అక్కడి నుంచి తెలంగాణకు వచ్చి పెత్తనం చేస్తామంటే ఇక్కడి ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణలో ఉన్న భూములు, నిధుల కోసమే ఆంధ్రా నేతలు వస్తున్నారని.. అంతే తప్ప తెలంగాణ ప్రజల మీద ప్రేమతో కాదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇక ఇటీవల తెలంగాణలోని ప్రసిద్ధ క్షేత్రమైన కొండగట్టు ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నుంచి రూ.35.19 కోట్ల నిధులను ఇప్పించిన పవన్ కళ్యాణ్ తన జేబులో నుంచి సొంత డబ్బులు ఇచ్చినట్లు డప్పు కొట్టుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం గురించి పవన్ కళ్యాణ్ నోరు జారి మాట్లాడారని.. ఆ వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని అడిగినా ఇంకా చెప్పలేదని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల దిష్టి కారణంగానే కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. ఇలా చేయడం తెలంగాణ ప్రజల సెంటిమెంట్‌ను దెబ్బతీశారని పేర్కొన్నారు. సినిమాల వరకు పవన్ కళ్యాణ్ ఓకే అని.. ఆయన సినిమాలు బాగుంటే తాము కూడా చూస్తామని తెలిపారు. కానీ ఇప్పుడు బీజేపీతో పొత్తు అని పవన్ కళ్యాణ్ మాట్లాడాతున్నారని.. ఆయన ఎవరితోనైనా పొత్తులు పెట్టుకోవచ్చు కానీ తెలంగాణ ప్రజలకు మాత్రం ఆయన తప్పనిసరిగా క్షమాపణలు చెప్పాల్సిందేనని అనిరుధ్ రెడ్డి తేల్చి చెప్పారు.



# హత్యలు, రేప్‌లు పెరిగిపోయాయి

**రేవంత్ సర్కార్‌పై డీకే అరుణ నిప్పులు**

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ డీకే అరుణ విమర్శలు గుప్పించారు. తెలంగాణలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని ఆమె మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత పన్నులు పెంచేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమవుతోందని ఆరోపించారు. ఖజానాలో చిల్లిగవ్వ లేదని... మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని విమర్శించారు. అన్ని మున్సిపాలిటీల్లో గెలుపే లక్ష్యంగా తమ పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించామని అరుణ తెలిపారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించానని చెప్పారు. మహబూబ్ నగర్, జడ్చర్ల, భూత్ పూర్ మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు అవసరమని అరుణ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పారదర్శక, అవినీతి రహిత పాలనే బీజేపీ లక్ష్యమని చెప్పారు. ప్రతి వార్డులో డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు తదితర అంశాలపై దృష్టి సారిస్తామని... కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణాల్లోని స్లమ్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని తెలిపారు.

# బండి సంజయ్, గంగుల ఒక్కటే

**వాళ్లతోనే కరీంనగర్ అవినీతిమయం: పొన్నం**

కరీంనగర్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. వీరి తీరుతో కరీంనగర్ అవినీతిమయమయిందని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఎంఐఎంతో కాంగ్రెస్ పార్టీ రూ. 100 కోట్ల డీల్ చేసుకుందంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కరీంనగర్ కార్పొరేషన్ లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒప్పందం కుదుర్చుకున్నాయని పొన్నం మండిపడ్డారు. ఈ పార్టీల పరస్పర అవగాహనతోనే అభ్యర్థుల ఎంపిక జరిగిందని ఆరోపించారు. బండి సంజయ్, గంగుల కమలాకర్ తీరుతో జిల్లా అవినీతిమయంగా మారిందని అన్నారు. పదేళ్లలో కరీంనగర్ జిల్లా పూర్తిగా నిర్లక్ష్యానికి గురయిందని చెప్పారు. జిల్లా పరిధిలోని కొండగట్టు, వేములవాడ ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

# రేవంత్‌కు చిప్పకూడు ఖాయం

**ఓటుకు నోటు కేసులో జైలు తథ్యం**

**మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజం**



మెదక్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓటుకు నోటు కేసులో రేవంత్ జైలుకు పోవడం ఖాయమని అన్నారు. అందుకే ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేశాడని ఆరోపించారు. మెదక్‌లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హరీష్ రావు మాట్లాడుతూ... ఫోరెన్సిక్ ల్యాబ్ జరిగిన అగ్ని ప్రమాదం వెనుక రేవంత్ రెడ్డి హస్తం ఉందని అన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ అని ఆరోపించారు. రేవంత్ రెడ్డి జైలుకు పోయే సమయం దగ్గరకు వచ్చిందని... అందుకే సాక్ష్యాలు మాయం చేసేందుకు హైదరాబాద్‌లో ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేశారని సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పోలీసుల సహకారంతో ఈ కుట్ర పన్నారని హరీష్ రావు ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో పేదల బతుకులు కూల్చిండని విమర్శించారు. జైలుకు పోకుండా ఉండేందుకు సాక్ష్యాలను మాయం చేశారని... ఇది రేవంత్ డైరెక్షన్‌లో పోలీసులు చేసిన దహనకాండ అని ఆరోపించారు. అయితే ఓటుకు నోటు కేసులో రేవంత్‌కు శిక్ష పడక తప్పదని, జైలుకు పోక తప్పదని అన్నారు. రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ చేసింది గుండు సున్నా అని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి మిర్యాలగూడ, భూపాలపల్లి, నిజామాబాద్ వెళ్లారని.. కానీ మెదక్‌కు వచ్చేందుకు ముఖం లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏడుపాయల అమ్మవారి మీద ఒట్టు వేసి మాట తప్పిండు కాబట్టి సీఎం రేవంత్ రెడ్డికి భయం అని ఆరోపించారు. రుణమాఫీ మాట తప్పి మోసం చేశారని, రైతుబంధు ఎగ్గొట్టిండు.. ఎరువుల కరువు తెచ్చారని ఆరోపణలు చేశారు. రేవంత్ బూతులు మాట్లాడటం తప్ప ఒక్క మంచి పని చేయలేదని విమర్శించారు. రంజాన్ తోఫా కూడా ఇవ్వడం లేదని, షాదీ ముబారక్ చెక్కులు రావడం లేదని, తులం బంగారంకు దిక్కు లేదని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ మైనార్టీ గురుకులాలు కట్టారని, షాదీఖానా ఏర్పాటు చేశారని... బీఆర్ఎస్ పార్టీని సెక్యూలర్ పార్టీగా నిలబెట్టారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హిందూ ముస్లింలను అన్నదమ్ములుగా చూసిందని తెలిపారు. రేవంత్ రెడ్డి తెల్లవారితే కేసీఆర్‌ను తిడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను తిడితే, హరీష్ రావును తిడితే పేదల కడుపు నిండుతుందా? అని ప్రశ్నించారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 12 వేలు అని గుండు కొట్టారని విమర్శించారు. ఉద్యోగస్తులకు డీఏ లేదు, పీఆర్సీ లేదని విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలను సీఎం రేవంత్ రెడ్డి దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ పిల్లల చదువులను ఆగం చేశారని.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అని దగా చేశారని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలని నిరుద్యోగులను మోసం చేశవారని ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ వాళ్లను గెలిపించుకోకుంటే బిల్లులు రావని బెదిరిస్తున్నారని మండిపడ్డారు.



# బీజేపీకి లైఫ్ లైన్ ఎంఐఎం

**అసదుద్దీన్ వారికి దేవుడు: రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు: బీజేపీకి లైఫ్‌లైన్ అసదుద్దీన్ ఒవైసీయేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ఈరోజు తెరపడుతోంది. ఈ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, బీజేపీ నాయకులు అసదుద్దీన్ ఒవైసీ పేరును ఎన్నిసార్లు తలుచుకుంటారోనని ఎద్దేవా చేశారు. మజ్లిస్ పార్టీని చూపించి ఇంకా ఎంతకాలం ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. బీజేపీ తెల్లారితే అసదుద్దీన్‌నే తలుచుకుంటారని, ఆయనే వారికి దేవుడు అన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై తీవ్రంగా మండిపడ్డారు. మోదీని చూసి ఓటు వేయాలని బీజేపీ నాయకులు చెబుతున్నారని, గల్లీ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలు వచ్చాయని ఇప్పుడు బీజేపీ నేతలు వచ్చి కేంద్రం నుంచి నిధులు తీసుకు వస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన నిధులు సహజంగానే వస్తాయని, వీరు తేవడమేమిటని అన్నారు. ప్రత్యేకంగా వారు ఏమైనా నిధులు తెస్తే చెప్పుకోవాలని అన్నారు. తెలంగాణ కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 42 పైసలు వస్తున్నాయని, అదే బీహార్ రూపాయి చెల్లిస్తే ఆరు రూపాయలు వెళుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. దక్షిణాదిను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఉత్తరాది రాష్ట్రాలకు అధిక నిధులు ఇస్తున్నారని, ఈ వివక్షపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. భారీ ప్రాజెక్టులు అన్నీ ఉత్తరాదికే వెళుతున్నాయని ఆరోపించారు. కేంద్రం కొత్తగా ఇచ్చిన ప్రాజెక్టులు ఏవీ లేవన్నారు. పన్నెండేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలో ఉన్నారని, 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ తెలంగాణను పాలించిందని, కానీ వారు చేసిందేమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తే మోరీని తీయడానికి మోదీ వస్తారా? బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే కేసీఆర్ వస్తారా? అని ప్రశ్నించారు. తాము రెండేళ్లలోనే ఎన్నో పనులు చేశామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తున్నామని, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించామని, పదేళ్లు ఇవ్వని రేషన్ కార్డులను ఇచ్చామని, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని ముఖ్యమంత్రి అన్నారు. మరోమారు కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని, కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తుకే ఓటు వేయాలని కోరారు. తమకు ఓటు వేస్తే అభివృద్ధి పూచీ మాదే అన్నారు.

# సర్పంచులకు అంగన్వాడీ బాధ్యతలు

**సర్పంచ్ చైర్మన్‌గా 11 మందితో కమిటీ**

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): తెలంగాణలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అధికారాలు అప్పగించింది. ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను పూర్తిగా సర్పంచ్‌లే చూసుకోనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పౌష్టికాహారం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టి, అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో రెండేళ్లపాటు గ్రామాల్లో ఎన్నికైన పాలకవర్గాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ పూర్తిగా గాడితప్పింది. చాలాచోట్ల పౌష్టికాహారం పక్కదారి పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఇటీవలే కొలువుదీరిన కొత్త పంచాయతీ పాలకవర్గాలకు ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సర్పంచ్‌ల నేతృత్వంలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనుంది. ఈ కమిటీకి సర్పంచ్ చైర్మన్‌గా వ్యవహరించనుండగా, మొత్తం 11 మంది సభ్యులు ఉంటారు. అంగన్‌వాడీ టీచర్ కన్వీనర్‌గా, ఏఎన్ఎం, స్కూల్ సైన్స్ టీచర్, ఒక రిటైర్డ్ ఉద్యోగి, చిన్నారుల తల్లులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి నెలా కేంద్రాలకు అందుతున్న బియ్యం, పప్పు, బాలామృతం, గుడ్లు, పాలు వంటి సరుకుల నాణ్యతను, పంపిణీని తనిఖీ చేస్తుంది. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న భోజనాన్ని కూడా పరిశీలిస్తుంది. లక్షల రూపాయల విలువైన పోషకాహారం లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడటమే ఈ కమిటీ ప్రధాన విధి.



# జీహెచ్‌ఎంసీ మేయర్ చివరి సమావేశం

**విజయలక్ష్మిని సన్మానించిన అధికారులు, కార్పొరేటర్లు**

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ చివరి సమావేశం నిర్వహించారు. అజెండా అంశాల్లోని 9 ప్రతిపాదనలకు, 11 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, నగర కార్పొరేటర్లు, అధికారుల సమష్టి కృషితో ఐదేళ్లలో నగరాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తన పదవీ కాలంలో కమిషనర్, అధికారులు ఎంతో సహకారం అందించారని, ఇది మరిచిపోలేనని అన్నారు. మేయర్ పదవీ కాలం పూర్తి కావడంతో విజయలక్ష్మిని ఆమె ఛాంబర్‌లో సన్మానించారు. కాగా, ఇటీవల అహ్మదాబాద్, రాజ్‌కోట్ పురపాలక సంఘాల్లో మేయర్ ఆధ్వర్యంలో పర్యటించిన కార్పొరేటర్ల బృందం నివేదికను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు అందించింది. స్టాండింగ్ కమిటీ ఆమోదించిన పనులు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ అన్నారు. కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలను చాలా వరకు పరిష్కరించామని అన్నారు.

# ఐదు రోజుల్లో రూ.11.83 కోట్ల ఆదాయం

**కొనసాగుతున్న మేడారం హుండీల లెక్కింపు**

హనుమకొండ, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): మేడారం సమ్మక్క సారక్క జాతరకు సంబంధించిన హుండీల లెక్కింపు కొనసాగుతోంది. నేటితో హుండీల లెక్కింపు ఐదో రోజుకు చేరుకుంది. ఇప్పటి వరకు 788 హుండీలను లెక్కించగా రూ.11.83 కోట్ల ఆదాయం వచ్చింది. ఈరోజు 163 హుండీలను లెక్కించగా రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరింది. మిగిలిన హుండీల లెక్కింపునకు సుమారు రెండు రోజులు పట్టవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. మంత్రి కొండా సురేఖ గత గురువారం కొబ్బరికాయ కొట్టి హుండీల లెక్కింపును ప్రారంభించారు. క్రితంసారి మేడారం జాతర ద్వారా రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది. హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో లెక్కిస్తున్నారు. హుండీల లెక్కింపు పూర్తయ్యాక బంగారం, వెండి వస్తువుల విలువను నిర్ధారిస్తారు.



# కాంగ్రెస్ అభ్యర్థి ఇంట్లో మద్యం బాటిళ్లు!



జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): జగిత్యాల పట్టణం 46వ వార్డులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి మన్సూర్ నివాసంలో మద్యం బాటిళ్లు దించుతుండగా ఎంఐఎం కార్యకర్తలు అడ్డుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి భర్త మన్సూర్ 'ఎవరితో ఏం కాదు.. ఏమైనా నేను చూసుకుంటా. ఇది ముస్లింలకు కాదు, వేరే వారికి పంచుతా' అంటూ వ్యాఖ్యలు చేసినట్లు ఎంఐఎం కార్యకర్తలు వీడియో విడుదల చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నప్పటికీ, ఇంటి లోపలికి వెళ్లకుండా బయటే ఉండిపోయారని విమర్శలు వచ్చాయి. అధికారులు ఇండిపెండెంట్లు, ప్రతిపక్షాలనే టార్గెట్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఇంట్లో మద్యం దించుతున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తమవుతోంది.





# తిరుమలలో లడ్డూ జిహాద్

**శ్రీనివాసానంద సరస్వతి ఆరోపణలు**

తిరుమల, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్‌పై ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూని కల్తీ చేశారని ఆరోపించారు. జగన్ హయాంలో నాణ్యత లేని లడ్డూలు తయారు చేశారని... ఇది అన్యమతస్తుల కుట్ర అని మండిపడ్డారు. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూని కల్తీ చేయడం దారుణమని అన్నారు. తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని తొలుత కూటమి నేతలు మాట్లాడినప్పుడు తాము పట్టించుకోలేదని... కానీ, ఇప్పుడు లడ్డూ కల్తీ జరిగిందని సీబీఐ రిపోర్ట్ ఇచ్చిందని, ఈ రిపోర్టుతో తాము భయాందోళనకు గురయ్యామని చెప్పారు. లవ్ జిహాద్ మాదిరి లడ్డూ జిహాద్ జరిగిందనే అనుమానం తమకు ఉందని అన్నారు. రసాయనాలు కలిసిన లడ్డూ తిని భక్తులు అనారోగ్యంపాలయ్యే అవకాశం ఉందని చెప్పారు. సీబీఐ రిపోర్ట్ ఆధారంగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. తప్పు చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని అన్నారు. రెండు కొండలు అన్న వైఎస్ రాజశేఖరరెడ్డికి ఎలాంటి శిక్ష పడిందో అందరూ చూశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లడ్డూ కల్తీపై నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే జగన్ అండ్ కో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# విజయవాడ పశ్చిమానికి ఫస్ట్

**గాజువాక సెకండ్**

**ఏపీలో నియోజకవర్గాలకు ర్యాంకులు**

విజయవాడ, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): ఏపీలో ప్రభుత్వ పాలనను పరుగులు పెట్టించేందుకు చంద్రబాబు నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల పనితీరుపై సర్వే నిర్వహించి, వాటికి ర్యాంకులు, గ్రేడులు కేటాయించారు. ఎమ్మెల్యేల పనితీరు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సంతృప్తి వంటి అంశాల ఆధారంగా చేపట్టిన ఈ సర్వేలో 93 శాతం మార్కులతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఈ నియోజకవర్గానికి బీజేపీ నేత సుజనా చౌదరి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ఈ ర్యాంకుల్లో 92 శాతం మార్కులతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్న గాజువాక నియోజకవర్గం రెండో స్థానాన్ని దక్కించుకుంది. కాకినాడ అసెంబ్లీ నియోజకవర్గం, విజయవాడ తూర్పు నియోజకవర్గాలు వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. ప్రభుత్వ పథకాల అమలు, శాసనసభ్యులు ప్రజలకు అందుబాటులో ఉండటం, ఫైళ్ల పరిష్కారం వంటి పలు కీలక అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ సర్వే నిర్వహించారు. రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాలను ఏ ప్లస్, ఏ, బీ గ్రేడులుగా విభజించారు. వీటిలో 21 నియోజకవర్గాలు ఏ ప్లస్ గ్రేడులో, 153 నియోజకవర్గాలు ఏ గ్రేడులో ఉండగా, కేవలం ఒక్క నియోజకవర్గం మాత్రమే బీ గ్రేడులో నిలవడం గమనార్హం. పాలనలో సాంకేతికతకు పెద్దపీట వేస్తున్న చంద్రబాబు, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఇటీవలే ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి, వారి పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ముఖ్యంగా తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు సలహాలు ఇస్తూ, వారిని ప్రోత్సహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ సాధించిన పల్లా శ్రీనివాసరావు, తాజాగా ఆయన నియోజకవర్గం పనితీరులోనూ రెండో స్థానంలో నిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. పనితీరును మరింత మెరుగుపరచుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా చంద్రబాబు ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు.

# అంబటికి బెయిల్.. అయినా జైల్లోనే!

**విడుదలవుతున్న సమయంలోనే మరో కేసు తెరపైకి**

**పోలీసులతో దురుసు ప్రవర్తన కేసులో 14 రోజుల రిమాండ్**

**ఈ నెల 22 వరకు అంబటికి జ్యుడీషియల్ కస్టడీ**



రాజమండ్రి, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఒక కేసులో ఊరట లభించినా, ఆయన జైలు నుంచి ఇప్పట్లో విడుదలయ్యే అవకాశం కనిపించడం లేదు. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు సోమవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన జైలు నుంచి బయటకు వస్తారని అంతా భావించారు. అయితే, ఆయన బెయిల్‌పై విడుదలవుతున్న సమయంలోనే పట్టాభిపురం పోలీసులు మరో కేసులో రంగప్రవేశం చేశారు. గతంలో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై నమోదైన కేసులో పీటీ వారెంట్‌పై అంబటిని స్పెషల్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం, ఆయనకు 14 రోజుల పాటు అంటే ఈ నెల 22 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. సీఎంపై వ్యాఖ్యల కేసులో ఈ నెల 1న అరెస్టయిన అంబటి, అప్పటి నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్న విషయం తెలిసిందే. తాజాగా ఒక కేసులో బెయిల్ వచ్చినా, మరో కేసులో రిమాండ్ పడటంతో పోలీసులు ఆయన్ను తిరిగి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. కాగా, అంబటి రాంబాబుపై రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36 కేసులు నమోదైనట్లు సమాచారం.







# హైదరాబాద్‌లో సాంస్కృతిక వైవిధ్యం

**ఎన్ఎస్డీ డైరెక్టర్ చిత్తరంజన్ త్రిపాఠి**

**భారత్ రంగ్ మహోత్సవ్ ప్రారంభం**

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): సాంస్కృతిక వైవిధ్యానికి హైదరాబాద్ కేరాఫ్ అని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా డైరెక్టర్ చిత్తరంజన్ త్రిపాఠి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో భారత్ రంగ్ మహోత్సవ్ నిర్వహించారు. ఎన్ఎస్డీ ఆధ్వర్యంలో శ్రీరామరాజ్యం నాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం త్రిపాఠి మాట్లాడుతూ.. తనకు హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం ఉందని అన్నారు. ఇక్కడ విభిన్న రకాల వర్గాల ప్రజలు ఉన్నారని, వారి వారి సంస్కృతిని కాపాడుకుంటున్నారని వెల్లడించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పంజాల, తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్లు డీఎస్ఎన్ మూర్తి, ఎన్జే బిక్షు తదితరులు పాల్గొన్నారు. కాగా, భారత్ రంగ్ మహోత్సవ్ ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ నాటకోత్సవాలలో ఒకటి. దీనిని న్యూఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఏటా నిర్వహిస్తుంది. భారతీయ రంగస్థల కళాకారుల ప్రతిభను చాటడానికి ఇది 1999లో ప్రారంభమైంది. ఇది మొదట జాతీయ స్థాయి పండుగగా ప్రారంభమై, ప్రస్తుతం ఆసియాలోనే అతిపెద్ద అంతర్జాతీయ నాటకోత్సవంగా గుర్తింపు పొందింది. ప్రస్తుతం జరుగుతున్న 25వ ఎడిషన్‌ను మునుపెన్నడూ లేనంత భారీ స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఈ నెల 20 వరకు కార్యక్రమాలు జరుగనున్నాయి. దేశవ్యాప్తంగా 40 ప్రాంతాలలో ఈ ప్రదర్శనలు జరుగుతున్నాయి. మొత్తం 277 భారతీయ నాటకాలు, 12 అంతర్జాతీయ నాటకాలు ప్రదర్శితమవుతున్నాయి. ఇవి దాదాపు 228 భాషలు, మాండలికాల్లో నాటకాలు ఉండటం విశేషం. ఇందులో భాగంగా అదిరంగ్ మహోత్సవ్ (గిరిజన నాటకాలు), జష్నే బచ్‌పన్ (పిల్లల నాటకాలు), తోలుబొమ్మలాటలు, వీధి నాటకాలు వంటి విభిన్న ప్రదర్శనలు ఉంటాయి.



# సురక్షిత బ్యాంకింగ్‌కు కేవైసీ

**జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్**

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): సురక్షిత బ్యాంకింగ్‌కు కేవైసీ (నో యువర్ కస్టమర్) తొలి అడుగు అని జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్‌తో కలిసి వారోత్సవాలకు సంబంధించిన గోడ ప్రతులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలలో సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులపై అవగాహన పెంపొందించడం, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన కేవైసీ వివరాలను నవీకరణ ప్రాముఖ్యాన్ని తెలియజేయడం, సైబర్ భద్రతపై జాగ్రత్తలు పాటించడం, ఆర్థిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం ఈ వారోత్సవం ముఖ్య ఉద్దేశ్యం అని చెప్పారు. ప్రతి పౌరుడు తన బ్యాంకు ఖాతాలకు సంబంధించిన కేవైసీ వివరాలను వెంటనే నవీకరించుకోవాలని కలెక్టర్ సూచించారు. కేవైసీ నవీకరణ ద్వారా బ్యాంకింగ్ సేవలు నిరంతరంగా అందుబాటులో ఉండటమే కాకుండా, ఖాతాల దుర్వినియోగాన్ని నివారించవచ్చు, లావాదేవీలు మరింత సురక్షితంగా ఉంటాయని, ప్రజలు ఓటీపీలు, పిన్ నంబర్లు, పాస్‌వర్డులు వంటి గోప్యమైన బ్యాంకింగ్ సమాచారాన్ని ఎవరికీ పంచుకోకూడదని, ఏవైనా అనుమానాస్పద లావాదేవీలు గమనించిన వెంటనే సంబంధిత బ్యాంకును సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్, సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్లు రమేష్, వెంకటేష్, నాగేంద్ర ప్రసాద్, వనజ, యమున, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా మున్సిపాలిటీలు

**రాయికల్ లో గులాబీ జెండా ఎగరవేస్తాం**

**జగిత్యాలలో మెజార్టీ సీట్లు సాధిస్తాం: ఎల్.రమణ**

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా మున్సిపాలిటీలు ఉండాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ అన్నారు. జగిత్యాలలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ హాయంలో జరిగిన అభివృద్ధిని ప్రజల ముందుంచామని, అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టామన్నారు. ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ ప్రచారానికి అపూర్వ స్పందన లభించిందని, జగిత్యాల నియోజకవర్గంలోని రాయికల్, జగిత్యాల పట్టణంలో గులాబీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. జగిత్యాల మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు ఊహించని తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దావ సురేష్, ఎల్ కార్తికేయ, పట్టణ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి అల్లాల ఆనంద్ రావు, మాజీ జడ్పీటీసీ కొలుముల రమణ, శీలం ప్రవీణ్, ఆసిఫ్, అనంతుల గంగారెడ్డి, పడిగేల గంగారెడ్డి, ఎండబెట్ల ప్రసాద్, వొళ్లాల గంగాధర్, వనమాల నిరంజన్, కుడిక్యాల సర్వేశ్వర్, అజ్ఘర్ ఖాన్, వసీం, గంగిపెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లాలో 24 వేల కోళ్ల మృతి

**భోపాల్ ల్యాబ్ పరీక్షల్లో బర్డ్ ఫ్లూగా నిర్ధారణ**

**ఆందోళన వద్దు, జాగ్రత్తలు పాటించాలన్న అధికారులు**



అన్నమయ్య జిల్లా, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): ఏపీలోని అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ వైరస్ మరోసారి తీవ్ర కలకలం సృష్టిస్తోంది. సదుం మండలంలోని మూడు గ్రామాల్లో వేలాది కోళ్లు అంతుచిక్కని రీతిలో మరణించడం స్థానికంగా ఆందోళనకు దారితీసింది. అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 24 వేలకు పైగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ పరిణామంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టింది. వివరాల్లోకి వెళితే.. సదుం మండలంలోని పుట్టవాండ్లపల్లె, కంభంవారిపల్లె, అమ్మగారిపల్లె గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లో గత కొన్ని రోజులుగా కోళ్లు భారీ సంఖ్యలో చనిపోతున్నాయి. దీంతో అనుమానం వచ్చిన పశుసంవర్ధక శాఖ అధికారులు రంగంలోకి దిగారు. మరణించిన కోళ్ల నుంచి నమూనాలను సేకరించి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న హై సెక్యూరిటీ యానిమల్ డిసీజ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. ఈ పరీక్షల్లో బర్డ్ ఫ్లూ వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అమ్మగారిపల్లె, పుట్టవారిపల్లె గ్రామాల్లో కోళ్ల మృతికి బర్డ్ ఫ్లూనే కారణమని స్పష్టమైందని, కంభంవారిపల్లె నివేదిక రావాల్సి ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై వెల్లడించారు. ఈ పరిణామాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తమ ప్రాంతంలో కోళ్లు గానీ, ఇతర పక్షులు గానీ అసాధారణ రీతిలో మరణిస్తే వెంటనే 70139 14401 లేదా 93982 62752 నంబర్లకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలను కోరారు.

# ఏపీలో త్వరలో నంది నాటకోత్సవాలు

విజయవాడ, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): ఏపీలో త్వరలోనే నంది నాటకోత్సవాలు నిర్వహించడంతో పాటు నంది అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, ఎన్టీఆర్ జిల్లా అధికారులు, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ పున్నమి ఘాట్ వద్ద బోధిసిరి బోటులో నిర్వహించిన 'కృష్ణాతీరం కవితాహారం'




కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుంటుపడిన సాంస్కృతిక రంగాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కళాకారులకు ఉగాది పురస్కారాలు, కందుకూరి పురస్కారాలు కూడా అందజేస్తామని తెలిపారు. ఇక, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో మహాకవి తిక్కన విగ్రహం ఏర్పాటు అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఇప్పటికే చర్చించామని, త్వరలో తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. అమరావతి ఒడిలో ప్రవహించే కృష్ణమ్మకు ఈతరం కవులు సమర్పించిన కవితా హారతిగా ఈ కార్యక్రమం నిలిచిందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఏపీ, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 51 మంది కవులు కవితలు వినిపించడంతో కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది.

# లగ్జరీ లైఫ్ కోసం దొంగగా టెకీ



వైజాగ్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): విలాసవంతమైన జీవితం కోసం ఓ మాజీ ఐటీ నిపుణుడు దొంగగా మారిన ఘటన విశాఖపట్నంలో వెలుగు చూసింది. బీఎండబ్ల్యూ కారు, విదేశీ పర్యటనలు వంటి ఖరీదైన అలవాట్ల కోసం వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అచ్చి మహేశ్ రెడ్డి అలియాస్ సన్నీ (27) అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ఐటీ కంపెనీలో పనిచేసిన పోస్ట్ గ్రాడ్యుయేట్ ఈ నేరాలకు పాల్పడ్డాడని తెలిసి పోలీసులు ఆశ్చర్యపోయారు. విశాఖ నగరంలోని గాజువాక, అరిలోవ, మల్కాపురం, పెందుర్తి, దువ్వాడ పరిధిలో జరిగిన 26 ఇళ్ల దొంగతనం కేసులను ఈ అరెస్ట్‌తో పోలీసులు ఛేదించారు. ఈ కేసుల్లో మొత్తం రూ. 24.66 లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైనట్టు గుర్తించారు. ఇందులో 1,084 గ్రాముల బంగారం, 6,300 గ్రాముల వెండి, రూ. 40,500 నగదు ఉన్నాయి. కాకినాడకు చెందిన సన్నీ, ప్రస్తుతం వైజాగ్‌లోని మాధవధారలో నివసిస్తున్నాడు. నిందితుడి నుంచి రూ. 15.63 లక్షల విలువైన 699 గ్రాముల బంగారు ఆభరణాలు, 3.8 కిలోల వెండి వస్తువులు, దొంగిలించిన డబ్బుతో కొనుగోలు చేసిన బీఎండబ్ల్యూ కారు, ఓ స్కూటర్, దొంగతనానికి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి వివరాల ప్రకారం సన్నీకి 15 ఏళ్ల వయసు నుంచే నేర చరిత్ర ఉంది. అప్పట్లో పీఎంపాలెం ప్రాంతంలో దొంగతనం చేస్తూ పట్టుబడగా జువైనల్ హోంకు పంపారు. విడుదలయ్యాక కాకినాడ, రాజమండ్రి ప్రాంతాల్లో మళ్లీ నేరాలకు పాల్పడి రాజమండ్రి సెంట్రల్ జైలులో 14 నెలల శిక్ష అనుభవించాడు. రాష్ట్రవ్యాప్తంగా ఇతనిపై 60కి పైగా దొంగతనం కేసులు ఉన్నట్టు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. సుత్తి, స్క్రూడ్రైవర్లు వంటి పరికరాలతో ముసుగు ధరించి రాత్రిపూట తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకునేవాడని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నిందితుడిపై సంబంధిత కేసులన్నీ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# యూపీఐతో పీఎఫ్ డబ్బులు విత్‌డ్రా

**ఏప్రిల్ నుంచి సేవలు.. అందుబాటులోకి యాప్**




న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తన సేవలను మరింత వేగవంతం, సులభతరం చేసే దిశగా ఒక విప్లవాత్మక అడుగు వేస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 8 కోట్ల మంది పీఎఫ్ ఖాతాదారులకు ప్రయోజనం చేకూర్చేలా సరికొత్త మొబైల్ అప్లికేషన్‌ను తీసుకురానుంది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి అందుబాటులోకి రానున్న ఈ యాప్ ద్వారా, సభ్యులు తమ పీఎఫ్ ఖాతాలోని అర్హతగల మొత్తాన్ని యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా తక్షణమే విత్‌డ్రా చేసుకునే సౌకర్యం కలగనుంది. "ఈపీఎఫ్ఓ 3.0" అప్‌గ్రేడ్‌లో భాగంగా ఈ కొత్త డిజిటల్ వ్యవస్థను ప్రవేశపెడుతున్నారు. ప్రస్తుతం పీఎఫ్ డబ్బుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, ప్రక్రియ పూర్తి కావడానికి కొన్ని రోజులు పడుతోంది. కాగా, కొత్త ఆటో–సెటిల్‌మెంట్ విధానంలో ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా మూడు రోజుల్లోనే క్లెయిమ్‌లు పరిష్కారమై, డబ్బు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. ఇప్పటికే ఈపీఎఫ్ఓ ఆటో–సెటిల్‌మెంట్ పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచింది. ఏటా 5 కోట్లకు పైగా క్లెయిమ్‌లను పరిష్కరించే ఈపీఎఫ్ఓపై భారాన్ని తగ్గించి, బ్యాంకుల తరహాలో వేగవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ కొత్త యూపీఐ విత్‌డ్రా వ్యవస్థలో పలు కీలక ఫీచర్లు ఉండనున్నాయి. సభ్యులు తమ యూపీఐ పిన్ ఉపయోగించి, అర్హత ఉన్న నిధులను దాదాపు తక్షణమే తమ బ్యాంక్ ఖాతాకు బదిలీ చేసుకోవచ్చు. వివాహం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం వంటి అత్యవసరాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రాథమికంగా ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ.25,000 వరకు విత్‌డ్రా చేసుకునే పరిమితిని ప్రతిపాదించారు. యాప్‌లో విత్‌డ్రాకు అందుబాటులో ఉన్న "అర్హతగల బ్యాలెన్స్" స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, పదవీ విరమణ భద్రత కోసం మొత్తం బ్యాలెన్స్‌లో కనీసం 25 శాతం లాక్ చేసి ఉంచుతారు. ప్రస్తుతం కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ 100 డమ్మీ ఖాతాలతో ఈ యాప్‌పై ట్రయల్ రన్స్ నిర్వహిస్తోంది. ఏవైనా సాంకేతిక సమస్యలుంటే గుర్తించి, పరిష్కరించిన తర్వాతే దీన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కొత్త యాప్ యూపీఐ విత్‌డ్రాయల్స్‌కు ప్రధాన వేదికగా మారినప్పటికీ, ఈపీఎఫ్ఓ యూనిఫైడ్ మెంబర్ పోర్టల్, ఉమాంగ్ యాప్ వంటి పాత ప్లాట్‌ఫామ్‌లు ఇతర సేవల కోసం యథావిధిగా పనిచేస్తాయని అధికారులు తెలిపారు.



## ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌పై భారీ డిస్కౌంట్


**వాలెంటైన్స్ డే ఆఫర్ ప్రకటించిన యాపిల్**

**అమెజాన్ పే ఐసీఐసీఐ క్రెడిట్ కార్డుపై 7,495 క్యాష్‌బ్యాక్**

న్యూఢిల్లీ: లవర్స్ డే సందర్భంగా ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌పై యాపిల్ భారీ డిస్కౌంట్ ప్రకటించింది. అమెజాన్‌లో ఐఫోన్ ఫోన్లపై ఆకర్షణీయమైన ఆఫర్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం అమెజాన్‌లో ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ 256జీబీ మోడల్ ధర సుమారు రూ. 1,49,900గా ఉంది. ఇది ప్రీమియం ఫోన్‌కు ఉండే సాధారణ ధరే అయినప్పటికీ, కొన్ని ఆఫర్లతో దీనిని తక్కువ ధరకు సొంతం చేసుకోవచ్చు. ప్రైమ్ మెంబర్లు అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు ఉపయోగించి కొనుగోలు చేస్తే, సుమారు రూ. 7,495 వరకు క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. అయితే ఇది తక్షణ తగ్గింపు కాదు. ఈ మొత్తం అమెజాన్ పే బ్యాలెన్స్‌లో జమ అవుతుంది. ఈ ప్రయోజనం కార్డు వినియోగదారులను బట్టి మారుతుంది, చెక్‌అవుట్ సమయంలో తుది మొత్తం తెలుస్తుంది. దీంతో పాటు ఎక్స్ఛేంజ్ ఆఫర్ కూడా అందుబాటులో ఉంది. పాత స్మార్ట్‌ఫోన్‌ను ఎక్స్ఛేంజ్ చేయడం ద్వారా గరిష్ఠంగా రూ. 48,000 వరకు తగ్గింపు పొందవచ్చు. ఉదాహరణకు, మంచి కండిషన్‌లో ఉన్న ఐఫోన్ 15 మోడల్‌కు సుమారు రూ. 32,150 వరకు ఎక్స్ఛేంజ్ విలువ లభించే అవకాశం ఉంది.

## ఎప్‌స్టీన్‌ది ప్రీ ప్లాన్డ్ మర్డర్?

న్యూయార్క్: సెక్స్ రాకెట్ సూత్రధారి జెఫ్రీ ఎప్‌స్టీన్ మృతి చెందడానికి ఒకరోజు ముందు అతని మరణ ప్రకటన సిద్ధం చేశారా? అంటే అవుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్‌స్టీన్ 2019 ఆగస్టు 10వ తేదీన అనుమానాస్పద స్థితిలో మాన్‌హట్టన్ జైలులో మృతి చెందాడు. అయితే, అతడి మరణ ప్రకటన ఒకరోజు ముందే తయారు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా న్యాయశాఖ తాజాగా విడుదల చేసిన ఫైళ్లలో ఆ తేదీ ఆగస్టు 9గా ఉండటం గమనార్హం. ఎప్‌స్టీన్ జైలు గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు నాడు అధికారులు వెల్లడించారు. కానీ అతడి మరణంపై నాటి నుంచి అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఎప్‌స్టీన్ మరణించడానికి ఒకరోజు ముందు ఆరెంజ్ దుస్తులు ధరించిన ఒక వ్యక్తి ఎప్‌స్టీన్ జైలు గది వైపు కదులుతున్నట్లుగా సీసీటీవీ దృశ్యాలు వెలుగు చూశాయి. ఆ కదులుతున్న వ్యక్తి జైలు అధికారి అని న్యాయశాఖ చెబుతోంది. ఎప్‌స్టీన్ చనిపోయాడని గుర్తించిన తర్వాత తీసిన ఫొటోలను తాజాగా బహిర్గతం చేశారు. అతడు మరణించాడని గుర్తించిన 16 నిమిషాల తర్వాత బతికించేందుకు వైద్యులు ప్రయత్నిస్తున్నట్లుగా ఆ చిత్రంలో ఉంది. అతడు మృతి చెందాడని ధృవీకరించిన అనంతరం ఆసుపత్రిలో తీసిన ఫొటోల్లో పేరును తప్పుగా రాశారు. ఇవి పలు అనుమానాలకు తావిస్తున్నాయి.



## నరవణె బుక్ లీక్.. కేసు నమోదు

న్యూఢిల్లీ: భారత సైన్య మాజీ అధిపతి జనరల్ ఎంఎం నరవణె రాసిన పుస్తకం ప్రచురణకు ముందే ఆన్‌లైన్‌లో లీక్ కావడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పేరుతో జనరల్ నరవణె తన ఆత్మకథను రాశారు. అయితే, ఈ పుస్తకం ప్రచురణకు ఇంకా సంబంధిత అధికారుల నుంచి అవసరమైన అనుమతులు రాలేదని తెలిసింది. ఇంతలోనే ఈ పుస్తకం ప్రీ–ప్రింట్ కాపీ సోషల్ మీడియా, ఆన్‌లైన్ న్యూస్ ఫోరమ్‌లలో సర్క్యులేట్ అవుతున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. దీనిపై ప్రాథమిక విచారణ జరపగా, కొన్ని వెబ్‌సైట్లలో ఈ పుస్తకం పీడీఎఫ్ కాపీ అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. ప్రముఖ ప్రచురణ సంస్థ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా తయారు చేసినట్లుగా ఈ పీడీఎఫ్ ఉంది. అంతేకాకుండా కొన్ని ఆన్‌లైన్ మార్కెటింగ్ వేదికలు ఈ పుస్తకం ముఖచిత్రాన్ని ప్రదర్శిస్తూ, కొనుగోలుకు సిద్ధంగా ఉన్నట్లు చూపించడం పోలీసులను ఆశ్చర్యపరిచింది. ప్రచురణకు అనుమతులు రాకముందే అత్యంత కీలకమైన పుస్తకం ఎలా లీక్ అయిందనే దానిపై సమగ్రంగా దర్యాప్తు చేసేందుకు ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ విభాగంలో కేసు నమోదు చేశారు. ఈ లీకేజీ వెనుక ఎవరున్నారనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

# పంజాబ్ సీఎం విదేశీ పర్యటనకు కేంద్రం నో

**వివాదంగా పొలిటికల్ క్లియరెన్స్ నిబంధన.. కక్ష సాధింపు చర్యలంటూ ఆప్ మండిపాటు**



చండీగఢ్: పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ విదేశీ పర్యటనపై కేంద్ర ప్రభుత్వం మరోసారి నీళ్లు చల్లింది. యూరప్ లో పర్యటించేందుకు మాన్ విదేశాంగ శాఖ అనుమతి కోరగా తిరస్కరించింది. దీంతో ముఖ్యమంత్రి మాన్ పర్యటన అర్ధాంతరంగా రద్దయింది. ఇటీవల మాన్ విదేశీ పర్యటనలకు అనుమతి నిరాకరించడం ఇది వరుసగా మూడోసారి కావడం గమనార్హం. పంజాబ్ ప్రభుత్వం వచ్చే నెలలో నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్టర్స్ సమ్మిట్' కోసం పెట్టుబడులను ఆహ్వానించడానికి భగవంత్ మాన్ చెక్ రిపబ్లిక్ మరియు నెదర్లాండ్స్‌లో పర్యటించాల్సి ఉంది. పారిశ్రామికాభివృద్ధి, విద్య, మరియు విదేశీ పంజాబీల సహకారం కోసమే ఈ పర్యటన ఖరారైంది. అయితే కేంద్రం నుంచి క్లియరెన్స్ రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు బ్రేక్ పడింది. రాష్ట్రాల ముఖ్యమంత్రులు విదేశాల్లో పర్యటించేందుకు విదేశాంగ శాఖ అనుమతి తీసుకోవడం తప్పనిసరి. దీనినే పొలిటికల్ క్లియరెన్స్ గా వ్యవహరిస్తారు. అయితే, ఈ నిబంధన చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. పంజాబ్ విషయానికి వస్తే.. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పర్యటనలపై కేంద్రం వరుసగా ఆంక్షలు విధిస్తోంది. పొలిటికల్ క్లియరెన్స్ నిరాకరిస్తోంది. ఈ ఏడాది జనవరిలో యూకే మరియు ఇజ్రాయెల్ లో పర్యటించేందుకు మాన్ అనుమతి కోరగా నిరాకరించింది. గతంలో పారిస్ ఒలింపిక్స్ సందర్శనకూ ఇలాగే అడ్డుచెప్పడంతో ఆ పర్యటన రద్దయింది. తాజాగా చెక్ రిపబ్లిక్, నెదర్లాండ్స్ పర్యటనకూ మాన్ కు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. అయితే, ఈ అనుమతిని నిరాకరించడానికి గల కారణాలను విదేశాంగ శాఖ బహిరంగంగా వెల్లడించలేదు. ఈ వ్యవహారం ఇప్పుడు కేంద్ర–రాష్ట్ర సంబంధాల మధ్య మరోసారి చిచ్చు రేపింది. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తీవ్రంగా ఖండించింది. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల అభివృద్ధిని కేంద్రం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని ఆప్ నేతలు మండిపడుతున్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు విదేశాలకు వెళ్తున్నప్పుడు పంజాబ్ సీఎంకు మాత్రమే అనుమతి ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నిస్తున్నారు.

# హిమంతపై అసద్ ఫిర్యాదు


**చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సీపీకి కంప్లెయింట్**



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఈవార్తలు): అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మపై మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ వర్గం వ్యక్తులను తుపాకీతో కాలుస్తున్నట్లుగా ఉన్న వీడియోను హిమంత సోషల్ మీడియాలో షేర్ చేశారు. సోషల్ మీడియాలో విమర్శలు రావడంతో ఈ వీడియోను బీజేపీ తొలగించింది. ఈ వీడియోపై అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ముస్లింలను కాల్చుతున్నట్లుగా ఉన్న హింసాత్మక వీడియో నేపథ్యంలో హిమంతపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. ముస్లింలను రెచ్చగొట్టేలా దురుద్దేశపూర్వకంగా ఈ వీడియోను పోస్టు చేసినందుకు చర్యలు తీసుకోవాలని, అసోం ముఖ్యమంత్రి రెండు మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ఆయన తీరు జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించేలా ఉందని మండిపడ్డారు. ఈ మేరకు ఈ వీడియోను పోస్టు చేసిన హిమంత బిశ్వపై చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. దురదృష్టవశాత్తు, జాతి విద్వేష ప్రసంగం కొందరికి అలవాటుగా మారిందని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా హిమంత బిశ్వ శర్మకు సామాజిక మాధ్యమాల్లో, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, బహిరంగ సభలు, ఇతర వేదికలలో ఒక వర్గానికి వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నారని కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదు లేఖలో పేర్కొన్నారు. ఆయన చేసిన ప్రసంగాలు అన్ని వేదికల్లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ముస్లింలను రెచ్చగొట్టేలా మాట్లాడుతూ, రెండు వర్గాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

## ఆరెస్సెస్ వల్లే బీజేపీకి 'అచ్ఛే దిన్'

**శతాబ్ది ఉత్సవాల్లో మోహన్ భగవత్ వ్యాఖ్య**



ముంబై: దేశంలో బీజేపీ అప్రతిహత విజయాలకు ఆరెస్సెస్ విధానాలే కారణమని, సంఘ్ వల్లే బీజేపీకి అచ్ఛే దిన్ వచ్చాయని మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముంబైలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో ఆర్ఎస్ఎస్ కు అచ్ఛే దిన్ వచ్చాయన్న వ్యాఖ్యలపై భగవత్ స్పందించారు. నిజానికి బీజేపీ అధికారంలోకి రావడానికి, ఆ పార్టీకి మంచి రోజులు రావడానికి కారణం ఆర్ఎస్ఎస్ అని చెప్పారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం విషయంలో సంఘ్ పట్టుదలగా వ్యవహరించడం, ఈ ఉద్యమానికి సహకరించిన పార్టీలకు ప్రయోజనం కలిగిందని పేర్కొన్నారు. దీంతోపాటు స్వయంసేవకుల కఠోర శ్రమ కూడా ఉందని భగవత్ స్పష్టం చేశారు.

## జియో స్మార్ట్ ఇన్వర్టర్లు

**మరో సంచలనం దిశగా రిలయన్స్**




ముంబై: గృహ విద్యుత్ అవసరాల కోసం కొత్త ప్రొడక్ట్ ను తీసుకొచ్చేందుకు రిలయన్స్ సిద్ధమవుతోంది. జియో స్మార్ట్ ఇన్వర్టర్ హోమ్ సిస్టం, సోలార్ ప్యానల్ సొల్యూషన్స్ పేరుతో కొత్తగా జియో ఇన్వర్టర్లు రాబోతున్నాయి. దేశంలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ కోతలు ఉంటున్న సంగతి తెలిసిందే. వేసవిలో కోతలు మరింత ఎక్కువవుతాయి. విద్యుత్ కోతలను ఎదుర్కొంటున్న వినియోగదారులే టార్గెట్ గా జియో ఇన్వర్టర్లను రిలయన్స్ తీసుకురాబోతోంది. బయట లభిస్తున్న ఇన్వర్టర్ల ధర దాదాపు రూ. 20 వేల వరకు ఉంటే... జియో ఇన్వర్టర్లు రూ. 5 వేల నుంచి రూ. 9 వేల వరకు ఉండొచ్చని చెబుతున్నారు.

## నార్వే దౌత్యవేత్త మోనా జూల్ రాజీనామా

లండన్: పలువురు ప్రముఖులకు లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్ స్టీన్ తో సంబంధాలు ఉన్నట్లు తాజాగా బయటపడింది. అమెరికా న్యాయ శాఖ శుక్రవారం విడుదల చేసిన ఎప్ స్టీన్ ఫైల్స్ లో నార్వే దౌత్యవేత్త మోనా జూల్ పేరు 33 చోట్ల ప్రస్తావనకు వచ్చింది. ఎప్ స్టీన్ తన వీలునామాలో మోనా ఇద్దరు పిల్లలకు 10 మిలియన్ డాలర్లు రాయడం మరింత సంచలనం సృష్టించింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో నార్వే విదేశాంగ శాఖ ఆమెను పదవి నుంచి తాత్కాలికంగా తప్పించింది. మోనాపై విచారణకు ఆదేశించింది. ఈ పరిణామంతో మోనా తన పదవికి రాజీనామా చేసింది. నార్వే క్రౌన్ ప్రిన్స్ మెట్టే మారిట్, మాజీ ప్రధాని థోర్బ్ జార్న్ జాగ్లాండ్ పేర్లు కూడా ఎప్ స్టీన్ ఫైల్స్ లో ప్రస్తావనకు వచ్చాయి. 2008 లో ఓ మైనర్ బాలికతో ప్రాస్టిట్యూషన్ చేయించాడని ఎప్ స్టీన్ పై కేసు నమోదైంది. ఓవైపు ఈ కేసు విచారణ జరుగుతుండగానే నార్వే క్రౌన్ ప్రిన్స్ మెట్టె మారిట్ ఎప్ స్టీన్ తో స్నేహం నెరపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మారిట్ 2011 నుంచి 2014 వరకు ఎప్ స్టీన్ తో స్నేహం కొనసాగించినట్లు తాజాగా బయటపడ్డ ఫైల్స్ తో వెల్లడైంది. మరోవైపు, నార్వేకు ప్రధానిగా వ్యవహరించడంతో నోబెల్ కమిటీకి కూడా జాగ్లాండ్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయనకు కూడా ఎప్ స్టీన్ తో సంబంధాలు ఉన్న విషయం తాజా ఫైల్స్ ద్వారా వెలుగులోకి వచ్చింది.

# రెండు సీట్ల నుంచి విజయ్ పోటీ!

**డీఎంకే టార్గెట్‌గా బరిలోకి**



చెన్నై: నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ తన రాజకీయ అరంగేట్రానికి పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. చెన్నైలోని విరుగంబాక్కం, మధ్య తమిళనాడులోని తిరుచ్చి తూర్పు స్థానాల నుంచి ఆయన బరిలోకి దిగనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇది పార్టీ విస్తరణతో పాటు వ్యవస్థాపకుడైన విజయ్‌కు బలమైన ఆరంభం ఇచ్చేందుకు రూపొందించిన వ్యూహమని టీవీకే నేతలు చెబుతున్నారు. చెన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం పట్టణ ఓటర్లు, మొదటిసారి ఓటు వేయనున్న యువతలో విజయ్‌కు మంచి ప్రచారం కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు తిరుచ్చి తూర్పు నుంచి పోటీ చేయడం ద్వారా పార్టీ కేవలం చెన్నైకే పరిమితం కాదనే సంకేతాన్ని రాష్ట్రవ్యాప్తంగా పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి వెలచ్చేరి, విక్రవాండి, నాగపట్టణం వంటి నియోజకవర్గాలను కూడా పరిశీలించినా, ఓటర్లతో ఉన్న పరిచయం, క్షేత్రస్థాయిలో పార్టీ సన్నద్ధత ఆధారంగా విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలను ఖరారు చేసినట్లు సమాచారం. విజయ్ తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తుండటం, అధికార డీఎంకే బలంగా ఉండటంతో గెలుపు అవకాశాలను పెంచుకునేందుకే రెండు చోట్ల పోటీ చేయాలనే జాగ్రత్తతో కూడిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాలకు డీఎంకే ఎమ్మెల్యేలు ఏ.ఎం.వి. ప్రభాకర రాజా, ఇనిగో ఎస్. ఇరుదయరాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ రెండు చోట్లా పోటీ ఆసక్తికరంగా మారనుంది. త్వరలోనే విజయ్ తన ప్రచార వ్యూహాలను ప్రకటించి, బహిరంగ సభలను ముమ్మరం చేయనున్నారు.

# తల్లి నగ్న వీడియోలు ప్రియుడికి!

**కూతురి దుశ్చర్య.. బెంగళూరులో దారుణం**

బెంగళూరు: తల్లి , మరో మహిళా బంధువుకు సంబంధించిన ప్రైవేట్ ఫొటోలు, వీడియోలను రహస్యంగా చిత్రీకరించి, వాటిని తన ప్రియుడికి పంపించింది. నగరంలోని మైసూర్ రోడ్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. కూతురు ఫోన్ లో తన ప్రైవేట్ ఫొటోలను, వాటిని మరో వ్యక్తికి పంపించినట్లు గుర్తించిన ఆ తల్లి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందిన 23 ఏళ్ల యువతి తన చదువుకు, ఉద్యోగ ప్రయత్నాలకు అవసరమని కోరడంతో తండ్రి ఆమెకు ఒక స్మార్ట్‌ఫోన్ కొనిచ్చారు. ఈ ఫోన్ తో కూతురు తన తల్లి నిద్రిస్తున్న సమయంలో ఆమె ప్రైవేట్ భాగాలను ఫోటోలు తీయడం, బంధువు స్నానం చేస్తున్నప్పుడు రహస్యంగా వీడియోలు తీయడం వంటి పనులకు పాల్పడింది. వాటిని తన ప్రియుడికి పంపించింది. ఇటీవల కూతురు గదిలోకి వెళ్లిన తల్లికి ఆమె ఒక గుర్తుతెలియని వ్యక్తితో వీడియో కాల్ మాట్లాడుతుండడం గమనించింది. తనను చూడగానే కూతురు ఆ కాల్ ను కట్ చేయడంతో అనుమానించింది. ఆ తర్వాత కూతురు ఫోన్ ను చెక్ చేయడంతో అసలు నిజం బయటపడింది. ప్రియుడు వరుణ్ (అలియాస్ గిరిధర్) ఒత్తిడి మేరకే తాను ఈ పని చేశానని యువతి తెలిపింది. తన తల్లి, పెద్దమ్మకు సంబంధించిన అసభ్యకర ఫోటోలు, వీడియోలను తీసి వాట్సాప్ లో వరుణ్ కు పంపినట్లు చెప్పింది. ఈ ఘటనపై ఫిబ్రవరి 5న బాధితురాలు ఫిర్యాదు చేయగా.. సమాచార సాంకేతిక చట్టం, భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితురాలైన యువతితో పాటు ఆమె ప్రియుడి ఫోన్లను సీజ్ చేసినట్లు వివరించారు. కాగా, తల్లి ఫిర్యాదు చేసిన కొన్ని రోజులకే ఆ యువతి ఇంటి నుండి పారిపోయి సదరు యువకుడిని వివాహం చేసుకున్నట్లు సమాచారం.

## సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలి: కంగనా



సిమ్లా: వీర్ సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలన్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ సమర్థించారు. వీర్ సావర్కర్‌కు భారత అత్యున్నత పురస్కారం లభించాలని ఆమె అన్నారు. దేశానికి సావర్కర్ చేసిన సేవలు ఆ పురస్కారం కంటే గొప్పవేనని అన్నారు. పార్లమెంటు సమావేశాలకు హాజరైన ఆమె విలేకరులతో మాట్లాడారు. సావర్కర్ విషయంలో మోహన్ భగవత్ వ్యక్తపరిచిన అభిప్రాయం ప్రతి భారతీయుడి మదిలో ఉందని ఆమె అన్నారు. సావర్కర్‌కు భారతరత్న లభిస్తే అది ప్రతి భారతీయుడికి గర్వకారణమని అన్నారు. బీజేపీ రాజస్థాన్ అధ్యక్షుడు మదన్ రాథోడ్ కూడా మోహన్ భగవత్ డిమాండుకు మద్దతు ఇచ్చారు. భారతదేశ స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం ఎన్నో కష్టాలను ఓర్చిన దేశభక్తుడు, విప్లవకారుడు సావర్కర్ అని అన్నారు. ఆయన కాలాపానీ జైల్లో ఎన్నో సంవత్సరాలు ఉన్నాడని గుర్తు చేశారు. జైలు నుంచి బయటకు వచ్చాక కూడా పోరాటం చేశారని తెలిపారు. అలాంటి గొప్ప దేశభక్తుడికి భారతరత్న ఇవ్వాలని అన్నారు. బీజేపీ ఎంపీ దినేశ్ శర్మ మాట్లాడుతూ, సావర్కర్ తన కంటే తన దేశాన్ని ఎక్కువగా ప్రేమించారని, భారతరత్నకు ఆయన అర్హుడని అన్నారు. సావర్కర్ తన జీవితమంతా కాలాపానీలో చిన్న జైలు గదిలో గడిపారని అన్నారు. సావర్కర్ నిజమైన జాతీయవాది, దేశభక్తి కలిగిన వ్యక్తి అన్నారు. ముంబైలో జరిగిన ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో మోహన్ భగవత్ పాల్గొని, వీర్ సావర్కర్‌కు భారతరత్న ఇస్తే దాని ప్రతిష్ఠ పెరుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ ప్రతిపాదనపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. సావర్కర్‌కు ఏ ప్రాతిపదికన భారతరత్న ఇవ్వాలని ప్రశ్నించింది.

వయ్యారి చిత్రం



కేతికా శర్మ




## కొత్తగా 'హై' సినిమా.. టీజర్ రిలీజ్

అనన్య శర్మ, ఎస్.కృష్ణ, పల్లవి దొర, కృష్ణ కమల్, సాయికృష్ణ, రేవంత్ (బుల్లిరాజు) కీలక పాత్రల్లో రూపొందుతున్న 'హై' సినిమాకు ఎస్.కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడితో కలిసి చాలా కాలంగా వర్క్ చేస్తున్న ఆయన.. ఇప్పుడు హై మూవీతో డైరెక్టర్ గా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తున్నారు. ప్రస్తుతం తన డెబ్యూ చిత్రం షూటింగ్ ను శరవేగంగా జరుపుతున్నారు. అయితే ఇప్పటికే థియేటర్లలో ప్రదర్శించిన గ్లింప్స్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. అదే జోష్ తో మేకర్స్ తాజాగా టీజర్ ను తీసుకొచ్చారు. దర్శకుడు అనిల్ రావిపూడి చేతుల మీదుగా రిలీజ్ చేశారు. అయితే రావిపూడి.. టీజర్ ను విడుదల చేసి మూవీ టీమ్ ను అభినందించారు. ఇంటర్నేషనల్ లెవెల్స్ తో రూపొందించిన థ్రిల్లర్ గా సినిమా నిలుస్తుందని ఆయన ప్రశంసించారు. అదే సమయంలో టీజర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారి అందరినీ ఆకట్టుకుంటోంది. సరికొత్త కాన్సెప్ట్ తో మూవీ రూపొందుతున్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. సినిమాలోని ప్రతి పాత్ర కూడా కథకు ముఖ్యమైన మలుపు తీసుకువస్తుందని టీజర్ చూస్తే అర్థమవుతుంది. ముఖ్యంగా వెబ్ సిరీస్ 30 వెడ్స్ 21 ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న అనన్య శర్మ.. మూవీలో కంప్లీట్ యాక్షన్ రోల్ లో కనిపించనుంది.

## ఇమాన్వికి మరో బిగ్ చాన్స్



రెబల్ స్టార్ ప్రభాస్ సినిమాలో అవకాశం దక్కించుకున్న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ ఇమాన్వి.. మరో బడా ప్రాజెక్టులో అవకాశం దక్కించుకుంది. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం హరీష్ శంకర్ తో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా షూటింగ్లో బిజీగా ఉన్నారు. మరోవైపు ఇప్పుడు సురేందర్ రెడ్డి సినిమాకి లాక్ చేశారు.. ఈ సంవత్సరం ఉగాది సందర్భంగా అధికారికంగా ఈ చిత్రాన్ని ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి వక్కంతం వంశీ స్క్రిప్ట్ కి తుదిమెరుపులు దిద్దుతుండగా.. రామ్ తాళ్లూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పుడు ఈ సినిమాలో హీరోయిన్గా ఇమాన్విని తీసుకోవాలని చిత్ర బృందం చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఇందులో అధికారిక ప్రకటన లేకపోయినా త్వరలో ఈమెను సంప్రదించి ఈమె డేట్స్ ను లాక్ చేయబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇక త్వరలోనే దీనిపై నిజానిజాలు తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా ఇమాన్వికి ఇప్పుడు క్రేజ్ భారీగా పెరిగిపోతోంది.



## ఒక్క రూపాయీ తీసుకోని తమన్నా

కథపై నమ్మకంతో పారితోషికం వదులుకున్న స్టార్స్ నేటి కాలంలో చాలా తక్కువమంది ఉంటారు. అలాంటి వారిలో విక్రాంత్ మాస్సే, తమన్నా భాటియా చేరిపోయారు. దర్శకుడు విశాల్ భరద్వాజ్ తెరకెక్కిస్తున్న 'ఓ రోమియో' విషయంలో విక్రాంత్, తమన్నా కథపై ఉన్న గౌరవంతో, దర్శకుడిపై ఉన్న నమ్మకంతో ఈ సినిమా కోసం ఒక్క రూపాయి కూడా పారితోషికం తీసుకోకుండా పనిచేశారని విశాల్ భరద్వాజ్ స్వయంగా వెల్లడించారు. విక్రాంత్ మాస్సే గురించి మాట్లాడుతూ.. ఆయన కెరీర్ తొలినాళ్లలోనే ఈ ప్రాజెక్ట్కు కమిట్ అయ్యారని విశాల్ తెలిపారు. '12త్ ఫెయిల్'తో భారీ సక్సెస్ అందుకున్నాక కూడా, విక్రాంత్ తన పాత మాటను నిలబెట్టుకున్నారు. విశాల్ భరద్వాజ్ రూపొందించిన 'మక్బూల్' సినిమా చూసి స్ఫూర్తి పొంది తాను నటుడిగా మారానని, అందుకే ఆయనపై గౌరవంతో ఈ సినిమాలో 8-9 రోజుల పాటు షూటింగ్లో పాల్గొని తన వంతు పాత్ర పోషించానని విక్రాంత్ తెలిపారు. తమన్నా భాటియా కూడా ఈ సినిమా బడ్జెట్ పరిమితులను అర్థం చేసుకుని ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా నటించడానికి ఒప్పుకున్నారని తెలిపారు.

## టాక్సిక్ నుంచి మరో బోల్డ్ పోస్టర్ రిలీజ్



రాకింగ్ స్టార్ యశ్ హీరోగా, గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో యష్కు జోడిగా కియారా అద్వానీ హీరోయిన్గా నటిస్తోంది. అలాగే లేడీ సూపర్ స్టార్ నయనతార, తారా సుతారియా, రుక్మిణి వసంత్, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్ వంటి వారు కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోన్న ఈ చిత్రం 2026 మార్చి 19న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ క్రమంలో తాజాగా ఈ మూవీ నుంచి కౌంట్ డౌన్ పోస్టర్ను రిలీజ్ చేశారు మేకర్స్. టాక్సిక్ మూవీ థియేటర్లలో రావడానికి ఇంకా 38 రోజులు మాత్రమే ఉంది' అని రాసుకొస్తూ బోల్డ్ పోస్టర్ షేర్ చేశారు. రాయ పాత్రను రివీల్ చేసిన టైమ్లో కారులో ఓ లేడీతో హీరో శృంగారం చేసిన సంగతి తెలిసిందే. ఆ లేడీనే హీరో మెడ దగ్గర ఎంతో మత్తుగా కిస్ చేస్తున్న ఫొటోను షేర్ చేశారు.

## జననాయగన్కు లైన్ క్లియర్



తమిళ దళపతి, హీరో విజయ్ 'జననాయగన్' సినిమాకు లైన్ క్లియర్ అయింది. తమిళనాడు రాజకీయాల్లోకి ప్రత్యక్షంగా వెళ్తున్న హీరో విజయ్ ప్రస్థానానికి ముందు నటిస్తున్న చివరి చిత్రం కావడంతో 'జననాయగన్' పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, గత కొంతకాలంగా ఈ సినిమా టైటిల్ వివాదం మద్రాస్ హైకోర్టు మెట్లెక్కిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ వివాదానికి ముగింపు పలుకుతూ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. హీరో విజయ్ నటించిన చివరి చిత్రం 'జననాయగన్' విడుదలకు సిద్ధమైన క్రమంలో.. ఆ టైటిల్ పై హక్కులు తమవేనంటూ కొందరు స్వతంత్ర నిర్మాతలు, రచయితలు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో ఇదే పేరుతో సినిమా తీయాలని భావించిన మరో చిన్న నిర్మాణ సంస్థతో కేవీఎన్ ప్రొడక్షన్స్కు వివాదం తలెత్తింది. దీంతో టైటిల్ రిజిస్ట్రేషన్, విడుదలకు సంబంధించి మద్రాస్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. విజయ్ పొలిటికల్ ఎంట్రీకి ఈ టైటిల్ చాలా పవర్ఫుల్గా ఉంటుందని భావించిన తరుణంలో ఈ న్యాయపరమైన అడ్డంకులు చిత్ర యూనిట్ను ఆందోళనకు గురిచేశాయి. తాజాగా తమిళ ఇండస్ట్రీ నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ రిట్ పిటిషన్ను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు నిర్మాణ సంస్థ తరపు న్యాయవాది విజయన్ సుబ్రమణియన్ హైకోర్టు రిజిస్ట్రార్కి అధికారిక లేఖ సమర్పించారు. ఈ పిటిషన్ ఉపసంహరణపై మంగళవారం విచారణ జరగనుంది. ఈ వివాదాన్ని కోర్టు వెలుపల పరిష్కరించుకోవడం, టైటిల్ విషయంలో క్లియరెన్స్ రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ నడుస్తోంది.







## మార్చి 19న అల్లు సినిమాస్ థియేటర్ ఓపెనింగ్

ఏషియన్ గ్రూప్స్ తో కలసి అల్లు అర్జున్ పలు థియేటర్లను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అల్లు సినిమాస్ పేరిట సినిమా ప్రేక్షకుడికి ప్రపంచ స్థాయి సినిమాటిక్ అనుభవాన్ని అందించడానికి మరో మల్టీప్లెక్స్ థియేటర్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఒక వైపు వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈయన.. మరొకవైపు మల్టీప్లెక్స్ థియేటర్ నిర్మాణ పనులను కూడా వేగంగా పూర్తి చేయిస్తూ.. డాల్బీ అట్మాస్ తో టాక్సిక్ , ధురంధర్ 2 సినిమాలను ప్రేక్షకులకు అందించడానికి సిద్ధమవుతున్నారు. అలా తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ప్రపంచంలోనే అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ ను ఆడియన్స్ కి అందిస్తూ.. డాల్బీ విజన్ 3డీ ప్రొజెక్షన్, డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టం తో అల్లు సినిమాస్ పేరిట అల్లు స్టూడియోస్ క్యాంపస్లో ఈ ప్రీమియం మల్టీప్లెక్స్ థియేటర్ను ఏర్పాటు చేస్తున్నారు.





# రో-కోకు డిమోషన్

## సెంట్రల్ కాంట్రాక్ట్స్ ప్రకటించిన బీసీసీఐ.. ఇషాన్ కిషన్, మహ్మద్ షమీకి షాక్

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) పురుషుల, మహిళా క్రికెటర్ల 2025-26 వార్షిక కాంట్రాక్టులను ప్రకటించింది. అందరూ ఊహించినట్లుగానే టీమిండియా మాజీ కెప్టెన్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు డిమోషన్ లభించింది. అంతేకాకుండా నాలుగు కేటగిరీలను మూడు కేటగిరీలకు బీసీసీఐ కుదించింది. గత కాంట్రాక్టుల్లో ఏ ప్లస్ కేటగిరిలో కొనసాగిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు బీ కేటగిరికి డిమోట్ అయ్యారు. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్, కోహ్లీలు కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. దాంతోనే ఈ ఇద్దరూ ఏ ప్లస్ కేటగిరి నుంచి బీ కేటగిరికి డిమోట్ అయ్యారు. ఏ ప్లస్ కేటగిరిని తొలగించిన బీసీసీఐ.. ఏ, బీ, సీ కేటగిరిల్లో భారత ఆటగాళ్లకు వార్షిక కాంట్రాక్టులు ప్రకటించింది.




### 30 మందికి ఛాన్స్..

మొత్తం 30 మంది పురుష ఆటగాళ్లు, 21 మంది మహిళా క్రికెటర్లకు బీసీసీఐ వార్షిక కాంట్రాక్టుల్లో చోటు దక్కింది. ఈ కాంట్రాక్టులు 2025 అక్టోబర్ 1 నుంచి 2026 సెప్టెంబర్ 30 వరకు కొనసాగుతాయి. ఈ మేరకు సోమవారం బీసీసీఐ ఓ ప్రకటనను విడుదల చేసింది. అయితే మూడు కేటగిరిల్లో ఆటగాళ్లకు ఏడాదికి ఎంత వార్షిక వేతనం అందుతుందో అనే వివరాలను బీసీసీఐ వెల్లడించలేదు. గత కాంట్రాక్టుల ప్రకారం ఏ ప్లస్ ఆటగాళ్లకు ఏడు కోట్లు, ఏ కేటగిరి ప్లేయర్లకు రూ.5 కోట్లు, బీ కేటగిరి ఆటగాళ్లకు రూ.3 కోట్లు, సీ కేటగిరి ప్లేయర్లుకు కోటీ వార్షిక వేతనం అందేది. మహిళా క్రికెటర్ల కాంట్రాక్టుల్లో తెలుగు తేజం శ్రీచరణికి తొలిసారి చోటు దక్కింది. ఈ కడప బిడ్డకు సీ కేటగిరి కాంట్రాక్టు లభించింది. పురుషుల క్రికెటర్లలో హైదరాబాద్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు గ్రేడ్ బీ కాంట్రాక్ట్ దక్కగా.. తిలక్ వర్మ, నితీష్ రెడ్డి సీ కేటగిరి కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. అయితే, సెంట్రల్ కాంట్రాక్టుల నుంచి ఇద్దరు కీలక ప్లేయర్లను బీసీసీఐ తొలగించింది. ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న ఇషాన్ కిషన్, స్టార్ బౌలర్ మహ్మద్ షమీని సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తొలగించింది.




**గ్రేడ్ ఏ ఆటగాళ్లు:** శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా

**గ్రేడ్ బీ ఆటగాళ్లు:** విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, వాషింగ్టన్ సుందర్, కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్, కుల్దీప్ యాదవ్, యశస్వీ జైస్వాల్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్

**గ్రేడ్ సీ ఆటగాళ్లు:** అక్షర్ పటేల్, రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ, రింకూ సింగ్, శివమ్ దూబే, సంజూ శాంసన్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, ధృవ్ జురెల్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, నితీశ్ రెడ్డి, అభిషేక్ శర్మ, సాయి సుదర్శన్, రవి బిష్ణోయ్

### భారత మహిళా క్రికెటర్ల కాంట్రాక్టులు:

**గ్రేడ్ ఏ:** హర్మన్ ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ

**గ్రేడ్ బీ:** రేణుక ఠాకూర్, షెఫాలీ వర్మ, రిచా ఘోష్, స్నేహ్ రాణా, రాధా యాదవ్, అమన్‌జోత్ కౌర్, ప్రతికా రావల్, క్రాంతి గాడ్, ఉమా చెరీ, అరుంధతి రెడ్డి

**గ్రేడ్ సీ:** శ్రీ చరణి, యస్తికా భాటియా, హర్లీన్ డియోల్, కాశ్వీ గౌతమ్, జి కమలిని, వైష్ణవి శర్మ, తేజల్ హసబినీస్

## ఇటలీపై స్కాట్లాండ్ గెలుపు

**జార్జ్ మున్సే సూపర్ ఇన్నింగ్స్**

టీ20 ప్రపంచ కప్ -2026లో భాగంగా సోమవారం ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 207 పరుగులు చేసింది. 208 పరుగుల లక్ష్యఛేదనలో ఇటలీ.. 16.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. బెన్ మానెంటి (52), హెన్రీ మానెంటి (37), స్మట్స్ (22) మాత్రమే రాణించారు. స్కాట్లాండ్ బౌలర్లలో మైకేల్ లీస్క్ 4, మార్క్ వాట్ 2, బ్రాడ్ క్యూరీ, బ్రాడ్ వీల్, డేవిడ్సన్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జ్ మున్సే (84) అద్భుతమైన హాఫ్ సెంచరీ చేశాడు. మరో ఓపెనర్ మైకేల్ జోన్స్ (37) పరుగులు రాబట్టాడు. ఈ జోడీ తొలి వికెట్‌కు 126 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. తర్వాత వచ్చిన బ్రాండన్ మెక్‌మిలన్ (41 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. రిచీ బెరింగ్టన్ (15) పరుగులు చేశాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో మైకేల్ లీస్క్ (22) వరుసగా 4, 2, 4, 6, 6 బాదడంతో స్కోరు 200 దాటింది. ఇటలీ బౌలర్లలో అలీ హాసన్, గ్రాంట్ స్టీవర్ట్, థామస్ డ్రాకా, స్మట్స్ తలో వికెట్ తీశారు.




## కొత్త కోచ్‌లు కావలెను

**దరఖాస్తుకు చివరి తేదీ ఫిబ్రవరి 27**

**బీసీసీఐ ప్రకటన జారీ**

భారత క్రికెటర్లను సానబెడుతున్న బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కొత్త నియామకాలకు బీసీసీఐ పచ్చజెండా ఊపింది. పలు కీలక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేసింది. కోచింగ్ సిబ్బందితో పాటు పెర్ఫార్మెన్స్ స్టాఫ్ నియామకాలు కూడా చేపడుతున్నట్లు సోమవారం బీసీసీఐ వెల్లడించింది. ఆశావహులకు ఉండాల్సిన అర్హతలు, వయో పరిమితి వంటి వివరాలను కూడా వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. యువ క్రికెటర్లకు శిక్షణ కేంద్రంగానే కాదు.. రిహాబిలిటేషన్ కేంద్రంగానూ పేరొందిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భారత క్రికెట్‌కు చాలా కీలకం. గాయపడిన ఆటగాళ్లు కోలుకున్న తర్వాత




ఫిట్‌నెస్ సాధించేది ఇక్కడే. నిపుణుల పర్యవేక్షణలో వ్యాయామాలు చేసి.. ఫిట్‌నెస్ నిరూపించుకున్నాకే పునరాగమనం చేస్తుంటారు. అందుకని.. సీఓఈను ఎప్పటికప్పుడు పటిష్టం చేస్తుంటుంది బీసీసీఐ. ఈ క్రమంలోనే కొత్త కోచ్‌ల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఫిబ్రవరి 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ నింపిన అప్లికేషన్లను పంపాల్సిందిగా బీసీసీఐ కోరింది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. వడబోత అనంతరం.. అర్హులైన వాళ్లకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. అనంతరం కోచ్‌లుగా ఎంపికైన వాళ్ల పేర్లను బీసీసీఐ ప్రకటిస్తుంది.

**బ్యాటింగ్ కోచ్ - 2 పోస్టులు**

**ఫాస్ట్ బౌలింగ్ కోచ్ - 3 పోస్టులు**

**ఫీల్డింగ్ కోచ్ - నాలుగు పొజిషన్స్ (3 పురుషులు, ఒకరు మహిళ)**

**పెర్ఫార్మెన్స్ అనలిస్ట్ - ఒక పోస్ట్**

## బీసీసీఐ ఆదేశించలేం

### ఆ అధికారం మాకు లేదు

### పీసీబీకి ఐసీసీ స్పష్టీకరణ!

భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు పెట్టిన 5 డిమాండ్లలో మూడింటిని ఐసీసీ తిరస్కరించింది. ముఖ్యంగా భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌ల పునరుద్ధరణ, భారత్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ మధ్య ట్రై సిరీస్ నిర్వహించాలనే డిమాండ్లను ఐసీసీ తోసిపుచ్చింది. పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్ ఆడాలని బీసీసీఐని ఆదేశించే అధికారం తమకు లేదని, ఈ అంశం తమ పరిధిలో లేదని పీసీబీకి ఐసీసీ తేల్చి చెప్పింది. బీసీసీఐకి మాత్రమే ఈ అధికారం ఉందని, భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బీసీసీఐ నడుచుకుంటుందని పీసీబీకి ఐసీసీ స్పష్టం చేసింది. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా భారత్, పాక్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పీసీబీతో ఐసీసీ చర్చలు జరిపింది. లాహోర్‌లో ఆదివారం పీసీబీ ఛైర్మన్ మోహిసిన్ నఖ్వీతో ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ ఇమ్రాన్ ఖవాజా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రెసిడెంట్ అమీనుల్ ఇస్లాం సమావేశమయ్యారు. ఐదు గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో ఐసీసీ ముందు పాకిస్థాన్ ఐదు డిమాండ్లు పెట్టింది. అలాగే బంగ్లాదేశ్‌కు పూర్తి రెవెన్యూ ఇవ్వడం, వారికి భవిష్యత్ ఐసీసీ టోర్నమెంట్ కేటాయించడంతో పాటు వారిపై చర్యలు తీసుకోవద్దని, పార్టిసిపేషన్ ఫీజు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ రెండు డిమాండ్లకు అంగీకరించిన ఐసీసీ.. తుది నిర్ణయం వెల్లడించేందుకు 24 గంటల సమయం ఇచ్చింది. దీంతో భారత్‌తో మ్యాచ్ ఆడబోమన్న నిర్ణయాన్ని పాక్ యూటర్న్ తీసుకుంది.

## టీమిండియాకు గంభీర్ దావత్

టీమిండియా ఆటగాళ్లకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తన ఇంట్లో దావత్ ఇచ్చాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో శుభారంభం చేసిన టీమిండియా.. రెండో మ్యాచ్‌లో గురువారం నమీబియాతో ఢిల్లీ వేదికగా తలపడనుంది. ఈ మ్యాచ్ కోసం ఢిల్లీకి చేరిన టీమిండియాకు ఆదివారం రాత్రి గంభీర్ తన నివాసంలో ప్రత్యేక విందు ఇచ్చాడు. టీమిండియా ఆటగాళ్లతో పాటు సపోర్ట్ స్టాఫ్ కూడా ఈ పార్టీకి హాజరయ్యారు. బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌తో పాటు బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. గతంలో వెస్టిండీస్‌తో టెస్ట్ మ్యాచ్ జరిగినప్పుడు కూడా గంభీర్ ఇలాగే జట్టుకు ఆతిథ్యం ఇచ్చాడు. ఆటగాళ్ల మధ్య ఒత్తిడిని తగ్గించి, ఒక కుటుంబ వాతావరణాన్ని సృష్టించాలనే ఉద్దేశంతో గంభీర్ ఈ దావత్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ పార్టీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

## వైభవ్‌ను టీమిండియాలోకి తీసుకోవాలి: శశిథరూర్

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీని అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడించాలని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ డిమాండ్ చేశాడు. అద్వితీయమైన ప్రదర్శనతో అదరగొడుతున్న ఈ 14 ఏళ్ల కుర్రాడిని వీలైనంత త్వరగా భారత సీనియర్ జట్టులోకి తీసుకోవాలని ట్వీట్ చేశాడు. 'వైభవ్ సూర్యవంశీని వీలైనంత త్వరగా ఉన్నత స్థాయి క్రికెట్‌లోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. గతంలో మనం క్రీజులో 14 ఏళ్ల మేధావిని చూశాం. ఆయన పేరు సచిన్ టెండూల్కర్. ఆ సమయంలో మనం ఆయన ఎంతో కాలం వేచి ఉండేలా చేయలేదు' అని ఒక కమర్షియల్ ప్రకటనలోని వైభవ్ సూర్యవంశీ ఫొటోను షేర్ చేశాడు.




# మర్క్‌రమ్, ఎంగిడి జోరు

## సఫారీలు గెలుపు.. కెనడా కుదేలు

గత సీజన్ రన్నరప్ దక్షిణాఫ్రికా పదో ఎడిషన్‌లో అదిరే బోణీ చేసింది. బ్యాటింగ్ యూనిట్ దంచేయగా.. బౌలింగ్ దళం కెనడాను వణికించింది. లుంగి ఎంగిడి(4-31) సంచలన స్పెల్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తించాడు. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు పడినా.. నవనీత్ ధలివాల్(64) అర్ధ శతకంతో మెరవగా.. హర్ష్ ఠాకెర్(33) రాణించాడు. కానీ, సాధించాల్సిన రన్‌రేటు పెరిగిపోవడంతో పెద్ద షాట్లు ఆడబోయి టెయిలెండర్లు సైతం పెవిలియన్ చేరారు. దాంతో.. సఫారీ టీమ్ 57 పరుగుల తేడాతో గెలుపొంది ఘనంగా టోర్నీలో అడుగుపెట్టింది. పొట్టి ప్రపంచకప్ ఆరంభ పోరులో దక్షిణాఫ్రికా అలవోక విజయంతో బోణీ కొట్టింది. అహ్మదాబాద్‌లో కెప్టెన్ ఎడెన్ మర్క్‌రమ్(54), ట్రిస్టన్ స్టబ్స్(34 నాటౌట్), డేవిడ్ మిల్లర్(39 నాటౌట్)ల మెరుపులతో 214 పరుగుల భారీ స్కోర్ బాదిన ప్రొటీస్ జట్టు.. ఆతర్వాత ప్రత్యర్థిని 156కే కట్టడి చేసింది. పేసర్ లుంగి ఎంగిడి(4-31) నిప్పులు చెరగగా కెనడా బ్యాటర్లు చేతులెత్తేశారు. నవనీత్ ధలివాల్(64) హాఫ్ సెంచరీతో చెలరేగినా.. సహచరుల నుంచి స్పందన కరువవ్వడంతో సఫారీ జట్టు 57 పరుగులతో జయభేరి మోగించింది. భారీ ఛేదనలో కెనడా తొలి ఓవర్ మొదటి బంతికే వికెట్ కోల్పోయింది. ఎంగిడి(4-31) సంధించిన బంతిని ఆడాలా? వద్దా? అనే సందేహంతో టచ్ చేసిన కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా(0) వికెట్ కీపర్ డికాక్ చేతికి చిక్కాడు. ఆ తర్వాతి ఓవర్లో యువరాజ్ సమ్రా(12), నికోలస్ కిర్టన్(4)లను ఔట్ చేసిన ఎంగిడి కెనడాను కష్టాల్లోకి నెట్టాడు. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయిన ప్రత్యర్థిని ఈసారి రబడ దెబ్బకొట్టాడు. భారీ షాట్లు ఆడుతున్న శ్రేయాస్ మొవ్వ(9) ను బౌల్డ్ చేసి నాలుగో వికెట్ అందించాడు. టాపార్డర్ కుప్పకూలిన వేళ నవనీత్ ధలివాల్(64), హర్ష్ ఠాకెర్(33)లు జాగ్రత్తగా ఆడుతూ.. వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాది స్కోర్ వంద దాటించారు. కవర్స్‌పై బౌండరీ బాదిన హర్ష్ ఆ తర్వాత బంతికే బిగ్ షాట్ ఆడి ఔటవ్వగా.. ఐదో వికెట్ 69 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అర్ధ శతకం తర్వాత ధలివాల్ దూకుడుగా ఆడే క్రమంలో బాష్ ఓవర్లో వెనుదిరిగాడు. ఆ తర్వాత ఆడేవాళ్లెవరూ లేకపోవడంతో కెనడా 156కే పరిమితమైంది. దాంతో.. 57 పరుగులతో గెలిచిన ప్రొటీస్ జట్టు వరల్డ్‌కప్ వేటను ఘనంగా ఆరంభించింది. టాస్ గెలిచిన కెనడా బ్యాటింగ్ బదులు బౌలింగ్ ఎంచుకొని అందర్నీ ఆశ్చర్యపరిచింది. బలమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన దక్షిణాఫ్రికాను తక్కువకే కట్టడి చేయాలనుకున్న ఆ జట్టు ఆశలు ఆడియాశలయ్యాయి. ఓపెనర్ ఎడెన్ మర్క్‌రమ్ (59).. క్వింటన్ డికాక్(25)లు కెనడా బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ ధనాధన్ ఆడారు. డికాక్‌ను బౌల్డ్ చేసిన దిల్‌ప్రీత్ బజ్వా తొలి వికెట్‌కు 70 పరుగులు జోడించి పునాది వేసిన ఈ ద్వయాన్ని విడదీశాడు. మర్క్‌రమ్ దూకుడుగా ఆడి 28 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. కానీ, కాసేపటికే అతడు అన్ష్ పటేల్ ఓవర్లో ఔటయ్యాడు. అనంతరం డెవాల్డ్ బ్రెవిస్(6) విఫలమైనా.. రియాన్ రికెల్టన్(33).. 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో చెలరేగాడు. ట్రిస్టన్ స్టబ్స్(34 నాటౌట్), డేవిడ్ మిల్లర్(39 నాటౌట్)లు డెత్ ఓవర్లలో బౌండరీలతో చెలరేగి స్కోర్ బోర్డును ఉరికించారు. ఫలితంగా సఫారీ జట్టు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది.

ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
మంగళవారం 10-2-2026

# మన ఇస్తరాకు ఎటుపాయె?

తెలంగాణ ప్రాంతపు ప్రజాజీవితంలో "మోదుగ (మోతుకు) ఆకు" అనే పదం ఒక సాధారణ వృక్షపు ఆకుకే పరిమితం కాదు. ఇది తరతరాలుగా కొనసాగిన భోజన సంప్రదాయానికి, ఆరోగ్య చైతన్యానికి, గ్రామీణ స్వావలంబనకు ప్రతిరూపంగా నిలిచిన పదం. అడవుల్లో, పొలాల అంచుల్లో, చెరువుల పరిసరాల్లో సహజంగా పెరిగే మోదుగ చెట్టునుంచి లభించే ఈ ఆకును శుభ్రపరచి, ఎండబెట్టి, చేతితో కుట్టి విస్తరిగా తయారుచేయడం తెలంగాణ ప్రజల జీవన నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుంది. మోదుగ ఆకుతో చేసిన ఇస్తారా విస్తరిలో భోజనం చేయడం ఆరోగ్యపరంగా మేలైన అలవాటుగా పెద్దలు భావించారు. ఈ ఆకులో సహజ ఔషధ గుణాలు ఉండటంతో జీర్ణక్రియ సవ్యంగా సాగుతుందని, శరీరానికి హాని కలిగించే పదార్థాలు ఆహారంలోకి చేరకుండా అడ్డుకుంటుందని గ్రామీణ అనుభవ జ్ఞానం చెబుతుంది. అందుకే శుభకార్యాలు, పండుగలు, సామూహిక విందులు జరిగే సందర్భాలలో మోదుగ ఆకు విస్తరి అనివార్యంగా ఉపయోగించబడింది. ఈ పదం మరో ముఖ్యమైన అర్థాన్ని కూడా కలిగి ఉంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
పౌర సంబంధాల అధికారి, కేయూ

పేదరికం, సంపద అనే తేడా లేకుండా అందరూ ఒకే విస్తరిలో భోజనం చేయాలనే సమానత్వ భావనకు ఇది ప్రతీక. బంతి భోజనంలో మోదుగ ఆకు విస్తరి పరచడం ద్వారా సామాజిక సమతుల్యత వ్యక్తమయ్యేది. అదే సమయంలో ఈ ఆకుల సేకరణ, విస్తరి తయారీ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి కల్పించే కుటీర పరిశ్రమగా పనిచేసింది. కాలక్రమంలో వాణిజ్య ఉత్పత్తులు, బయట ప్రాంతాల నుంచి వచ్చిన విస్తరుల ప్రభావంతో "మోదుగ ఆకు" అనే పదం వినియోగంలో తగ్గిపోతోంది. అయినప్పటికీ ఈ పదం తెలంగాణ ప్రజల జ్ఞాపకాలలో ఒక జీవంతమైన సాంస్కృతిక గుర్తింపుగా నిలిచిపోయింది. మోదుగ ఆకు అంటే కేవలం ఆకే కాదు. అది ఒక జీవన విధానం, ఒక ఆరోగ్య తత్వం, ఒక స్వదేశీ ఆర్థిక ఆలోచనకు సంకేతం. తెలంగాణ ప్రాంతపు ఆహార సంస్కృతి ఒక సాధారణ తిండి అలవాటు కాదు. జీవన విధానం, ఆరోగ్య అవగాహన, గ్రామీణ ఉపాధి, సామాజిక సమానత్వానికి సంబంధించిన సమగ్ర వ్యవస్థ. శుభకార్యాలు, పండుగలు, విందులు, బంతి భోజనాల సందర్భాలలో ఉపయోగించే విస్తరి తెలంగాణ ప్రజల ఆలోచనా ధోరణిని ప్రతిబింబిస్తుంది. ప్రాచీన కాలం నుండి తెలంగాణలో విస్తృతంగా లభించే మోదుగ ఆకుతో తయారైన ఇస్తారా విస్తరి ఈ సంస్కృతికి ప్రధాన ఆధారం. 2000 తరువాత కాలంలో ఆంధ్ర ప్రాంతంలోని కోనసీమ నుండి దిగుమతయ్యే అరిటాకుల విస్తరి తెలంగాణ భోజన వ్యవస్థలో వేగంగా ప్రవేశించింది. ఫలితంగా తరతరాలుగా కొనసాగిన మోదుగ ఆకు ఆధారిత విస్తరి వినియోగం క్రమంగా కనుమరుగవుతున్నది. పరిశోధకుల అంచనాల ప్రకారం తెలంగాణలో మోదుగ ఆకు విస్తరి వినియోగం కనీసం 500 సంవత్సరాలు కొనసాగింది. గ్రామీణ సమాజంలో ప్రతి శుభకార్యానికి ఇది తప్పనిసరి అంశం. హోటళ్లలో కూడా ఇదే విస్తరి వినియోగం సాధారణంగా కనిపించేది. తెలంగాణ బంతి భోజనం ఒక సామాజిక తత్వం. ఒకే వరుసలో, ఒకే విస్తరిలో, ఒకే ఆహారం. ఈ విధానంలో మోదుగ ఆకు విస్తరి కీలక పాత్ర పోషించింది. అరిటాకు ప్రవేశంతో ఈ సమానత్వ భావన స్థానంలో వాణిజ్య ఆలోచన బలపడింది.

ఈ సందర్భంలో ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. సంస్కృతి అనేది గతానికి సంబంధించిన జ్ఞాపకం కాదు. అది వర్తమానంలో జీవించి ఉండాలి. మోదుగ ఆకు విస్తరి తిరిగి భోజనాల్లోకి వస్తే అది కేవలం ఒక ఆకును తిరిగి ఉపయోగించినట్టు కాదు. అది తెలంగాణ తన మూలాలను తిరిగి పట్టుకున్నట్టు అవుతుంది. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చినట్టు అవుతుంది. గ్రామీణ స్వావలంబనకు దారి తీసినట్టు అవుతుంది. భవిష్యత్తు తరాలు తెలంగాణను గుర్తించాల్సింది కేవలం భౌగోళిక ప్రాంతంగా కాదు. ఒక ప్రత్యేక జీవన విధానంగా, ఒక ప్రత్యేక ఆహార సంస్కృతిగా గుర్తించాలి. ఆ గుర్తింపులో మోదుగ ఆకు విస్తరి ఒక కీలక చిహ్నం. అది లేకుండా తెలంగాణ భోజన సంస్కృతి సంపూర్ణంగా నిలబడలేను. ఈ నిజాన్ని ఇప్పుడు గుర్తించటం అత్యవసరం. అందుకే మోదుగ ఆకు అంతరించిపోతున్న దశను ఒక హెచ్చరికగా భావించాలి. ఇది ఆహారపు అలవాట్లలో మార్పు గురించి మాత్రమే కాదు. ఇది మనం ఏ దిశగా ప్రయాణిస్తున్నామనే ప్రశ్న. స్థానికతను వదిలి వాణిజ్య సౌలభ్యం వైపు పూర్తిగా వెళ్లిపోతున్నామా అనే ఆత్మపరిశీలన. ఈ ప్రశ్నకు సమాధానం ఇప్పుడే వెతకకపోతే, రాబోయే కాలంలో తెలంగాణ తన ప్రత్యేకతను కోల్పోయిన ఒక సాధారణ ప్రాంతంగా మాత్రమే మిగిలిపోయే ప్రమాదం ఉంది. మోదుగ ఆకు విస్తరి పునరాగమనమంటే గతాన్ని గౌరవించడం. అదే సమయంలో భవిష్యత్తును రక్షించుకోవడం. ఈ రెండు లక్ష్యాలు సాధించాలంటే సమాజం మొత్తం ఈ అంశాన్ని తన బాధ్యతగా భావించాలి. అప్పుడే తెలంగాణ భోజన విస్తరి తన ప్రాచీన గౌరవాన్ని తిరిగి పొందగలదు. అప్పుడే ఈ సంస్కృతి పుస్తకాల పుటలకే పరిమితం కాకుండా ప్రజల విస్తరిలో మళ్లీ జీవం పోసుకుంటుంది.

నేటి తెలంగాణ భోజన సంస్కృతిని పరిశీలిస్తే మోదుగ ఆకు విస్తరి తగ్గుదలతో పాటు ఆధునిక ప్లేట్ల వినియోగం వేగంగా పెరుగుతున్న దృశ్యం స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు భోజనం వడ్డించే విధానంలో గణనీయమైన మార్పు చోటు చేసుకుంది. ఒకప్పుడు ఆకులే భోజనానికి ఆధారం కాగా నేడు పేపర్ ప్లేట్లు, స్టీల్ ప్లేట్లు, పింగాణి ప్లేట్లు సాధారణంగా ఉపయోగంలోకి వచ్చాయి. పట్టణ హోటళ్లలో స్టీల్ ప్లేట్లు ప్రామాణికంగా మారాయి. శుభ్రత, దీర్ఘకాలిక వినియోగం అనే కారణాలతో ఇవి విస్తృతంగా ఆమోదం పొందాయి. వివాహ వేడుకలు, ఫంక్షన్ హాల్స్ లో స్టీల్ ప్లేట్ల వినియోగం సుమారు 70% వరకు పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే ఈ ప్లేట్ల వినియోగం భోజనాన్ని ఒక యాంత్రిక ప్రక్రియగా మార్చేస్తున్న భావన కూడా బలపడుతోంది. పింగాణి ప్లేట్లు మరో వైపు ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయి. సంపన్న వర్గాల విందులు, హోటల్ రెస్టారెంట్లు, అధికారిక సమావేశాలలో పింగాణి ప్లేట్లు గౌరవ సూచికగా ఉపయోగంలోకి వచ్చాయి. ఇది భోజనానికి ఆడంబరాన్ని జోడించినా, భోజన సంస్కృతిలో సమానత్వ భావనను తగ్గిస్తున్న అంశంగా మారుతోంది. ఒకే విందులో వేర్వేరు ప్లేట్లు కనిపించడం సామాజిక వ్యత్యాసాలను స్పష్టంగా చూపిస్తోంది. పేపర్ ప్లేట్ల వినియోగం మరింత వేగంగా విస్తరిస్తోంది. తక్కువ ఖర్చు, ఒకసారి వాడి పారేసే సౌలభ్యం కారణంగా వీటి వినియోగం పెరిగింది. పండుగలు, రాజకీయ సమావేశాలు, సామూహిక కార్యక్రమాలలో పేపర్ ప్లేట్లు సుమారు 60% వరకు ఉపయోగంలో ఉన్నట్లు అంచనా. అయితే ఇవి పర్యావరణానికి కలిగించే నష్టం దీర్ఘకాలంలో తీవ్రమైన సమస్యగా మారుతోంది. ఈ అన్ని ఆధునిక ప్లేట్ల వినియోగం ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతోంది. భోజనం అనేది ఇప్పుడు సంస్కృతి కంటే సౌలభ్యంపై ఆధారపడిన చర్యగా మారుతోంది. శుభ్రత, వేగం, ఖర్చు అనే అంశాలు ప్రధానంగా మారాయి. ఈ మార్పులో మోదుగ ఆకు విస్తరి వెనుకబడి పోతోంది. స్టీల్ ప్లేట్లు ఆరోగ్యపరంగా సురక్షితంగా భావించినా, వాటితో భోజనం చేసే అనుభూతి సహజత్వాన్ని కోల్పోతుంది. పింగాణి ప్లేట్లు ఆహారాన్ని విలాసవంతంగా చూపించినా, ఆహారానికి భూమితో ఉన్న అనుబంధాన్ని తెంచేస్తాయి. పేపర్ ప్లేట్లు తాత్కాలిక పరిష్కారంగా కనిపించినా, వ్యర్థాల సమస్యను పెంచుతున్నాయి. ఈ పరిస్థితిలో మోదుగ ఆకు విస్తరి విలువ మరింత స్పష్టంగా అవుతుంది. ఇది పర్యావరణానికి హానికరం కాదు. ఆరోగ్యానికి అనుకూలం. సామాజిక సమానత్వానికి ప్రతీక. గ్రామీణ ఉపాధికి ఆధారం. ఈ అన్ని లక్షణాలు ఆధునిక ప్లేట్లలో కనిపించవు. అందువల్ల నేటి తెలంగాణ సమాజం ముందు ఒక ఎంపిక ఉంది. పూర్తిగా ఆధునిక ప్లేట్లపై ఆధారపడే మార్గం ఒకటి. స్థానిక సంస్కృతిని ఆధునిక అవసరాలకు అనుగుణంగా పునరుద్ధరించే మార్గం మరొకటి. ఈ రెండో మార్గంలో మోదుగ ఆకు విస్తరి కీలక పాత్ర పోషించగలదు. ఆధునికతను పూర్తిగా తిరస్కరించడం అవసరం లేదు. స్టీల్ ప్లేట్లు, పింగాణి ప్లేట్లు, పేపర్ ప్లేట్లు అవసరమైన చోట ఉపయోగంలో ఉండవచ్చు. అయితే శుభకార్యాలు, పండుగలు, సంప్రదాయ విందులలో మోదుగ ఆకు విస్తరిని తిరిగి ప్రవేశపెట్టడం ద్వారా సంస్కృతి–ఆధునికత మధ్య సమతుల్యత సాధించవచ్చు. ఈ సమతుల్యత సాధించినప్పుడే తెలంగాణ భోజన సంస్కృతి సంపూర్ణంగా నిలబడుతుంది. మోదుగ ఆకు విస్తరి ఆధునిక ప్లేట్ల మధ్య తన స్థానం తిరిగి పొందిన రోజు తెలంగాణ తన మూలాలను తిరిగి గుర్తించిన రోజుగా చరిత్రలో నిలుస్తుంది. ఈ దిశగా ఇప్పుడే అడుగులు వేయడం కాలానికి తగిన అవసరంగా మారింది.

### పునరుద్ధరణకు కార్యాచరణ సూచనలు

మోదుగ ఆకు విస్తరి తయారీకి ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణ మద్దతు కల్పించాలి. హోటళ్లలో కనీసం 30% స్థానిక విస్తరి వినియోగ నిబంధన ఉంచాలి. పాఠశాల భోజన పథకాలలో ప్రయోగాత్మక అమలు చేయాలి. ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. మోదుగ ఆకు విస్తరి అంతరించిపోవడం అంటే ఒక ఆకును కోల్పోవడం కాదు. అది తెలంగాణ జీవన తత్వాన్ని కోల్పోవడమే. కోనసీమ అరిటాకు వాణిజ్యపరంగా విజయం సాధించినా, మోదుగ ఆకు లేకుండా తెలంగాణ భోజన సంస్కృతి సంపూర్ణంగా నిలవలేను. ఈ అంశాన్ని ఇప్పుడే గమనించకపోతే, రాబోయే తరాలకు తెలంగాణ ప్రత్యేకత పుస్తకాలలో మాత్రమే మిగిలే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. మోదుగ ఆకు ఆధారిత తెలంగాణ భోజన విస్తరి క్రమంగా కనుమరుగవుతున్న పరిస్థితి ఒక సాధారణ సంస్కృతి మార్పుగా మాత్రమే చూడలేం. ఇది ఆహారపు అలవాట్లలో జరిగిన చిన్న పరిణామం కూడా కాదు. ఇది తెలంగాణ ప్రజల చరిత్ర, జీవన తత్వం, ఆరోగ్య దృక్పథం, గ్రామీణ ఆర్థిక స్వావలంబన అన్నింటినీ కలిపి ప్రభావితం చేస్తున్న లోతైన సామాజిక పరిణామం. ఒకప్పుడు ప్రతి శుభకార్యానికి, ప్రతి బంతి భోజనానికి సహజంగా పరచబడిన మోదుగ ఆకు ఇస్తారా విస్తరి నేడు కనబడకపోవడం ఒక కాలం ముగిసిన సంకేతంగా మారింది. మోదుగ ఆకు వినియోగం తగ్గిపోవడం వల్ల ఆరోగ్య పరమైన నష్టాలు కూడా కనిపిస్తున్నాయి. పూర్వీకుల అనుభవ జ్ఞానం ఆధారంగా ఏర్పడిన భోజన విధానం శరీరానికి అనుకూలంగా రూపుదిద్దుకుంది. సహజ ఆకులో వడ్డించిన ఆహారం శరీరానికి హాని కలిగించే పదార్థాల ప్రభావాన్ని తగ్గించేది. ఈ అలవాటు దూరమవటం ద్వారా ఆధునిక ఆహారపు ప్రమాదాలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇది భవిష్యత్తు తరాల ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అంశంగా మారవచ్చు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పడిన ప్రభావం మరింత తీవ్రమైనది. మోదుగ ఆకు సేకరణ, ఇస్తారా తయారీ ఒకప్పుడు అనేక గ్రామాల్లో మహిళలకు స్థిరమైన ఉపాధిని అందించింది. ఇది పెట్టుబడి అవసరం లేకుండా సాగిన కుటీర పరిశ్రమ. ఈ వ్యవస్థ కూలిపోవడంతో గ్రామీణ మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతింది. ఉపాధి కోసం పట్టణాల వైపు వలసలు పెరిగే పరిస్థితి ఏర్పడింది. ఈ మార్పు గ్రామీణ సమాజ నిర్మాణానికే సవాలుగా మారుతోంది. కోనసీమ ప్రాంతం నుండి వచ్చే అరిటాకుల విస్తరి మార్కెట్ ను ఆక్రమించటం వెనుక వాణిజ్య శక్తులు పనిచేశాయి. పెద్ద ఎత్తున ఉత్పత్తి, సరఫరా సౌలభ్యం, ఖర్చు లెక్కలు ఈ మార్పుకు దారితీశాయి. కానీ ఈ వాణిజ్య విజయానికి మూల్యం తెలంగాణ స్థానిక సంస్కృతి చెల్లిస్తోంది. స్థానిక వనరుల విలువ తగ్గిపోవడం, స్థానిక జ్ఞాన వ్యవస్థలు నిర్లక్ష్యం పాలవటం ఈ మార్పు తెచ్చిన ప్రధాన పరిణామాలు. ఈ పరిణామాన్ని ఇప్పటికీ ఆపలేని స్థితి రాలేదు. మోదుగ ఆకు విస్తరి పునరుద్ధరణ సాధ్యమే. ప్రభుత్వ విధానాల ద్వారా, స్థానిక సంస్థల చొరవ ద్వారా, ప్రజల అవగాహన ద్వారా ఈ సంప్రదాయాన్ని తిరిగి నిలబెట్టే అవకాశం ఉంది. హోటల్ రంగంలో స్థానిక విస్తరి వినియోగానికి ప్రోత్సాహం ఇవ్వడం, శుభకార్యాల నిర్వహణలో మోదుగ ఆకు వినియోగాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడం, పాఠశాల స్థాయి నుంచే ఈ సంస్కృతిపై అవగాహన కల్పించడం వంటి చర్యలు ప్రభావవంతంగా మారగలవు.



## ఔషధ గుణాలు – శాస్త్రీయ దృష్టికోణం

**సామాజిక ఆరోగ్య అధ్యయనాల ప్రకారం**

**మోదుగ ఆకులో యాంటి బ్యాక్టీరియల్ లక్షణాలు గుర్తించబడ్డాయి**

**జీర్ణక్రియ సామర్థ్యం సుమారు 25%-30% వరకు మెరుగుపడే అవకాశం ఉంది**

**వేడి ఆహారంలో విషపదార్థాల శోషణ తగ్గే అవకాశం సుమారు 40%**

**మోదుగ ఆకు వినియోగం**

- 1990లో 85%
- 2000లో 60%
- 2010లో 25%
- 2025లో 5%

**అరిటాకు విస్తరి వినియోగం**

- 1990లో 10%
- 2000లో 35%
- 2010లో 70%
- 2025లో 92%

**గ్రామీణ కుటీర ఉపాధి**

- 1990లో 100%
- 2000లో 75%
- 2010లో 30%
- 2025లో 8%

### కోనసీమ అరిటాకుల ఆధిపత్యానికి కారణాలు

- భారీ స్థాయిలో వాణిజ్య ఉత్పత్తి
- హోటల్ రంగంలో ఖర్చు తగ్గింపు లక్ష్యం
- పట్టణ వినియోగదారుల దృశ్య ఆకర్షణ పట్ల ఆసక్తి
- స్థానిక విస్తరులకు మార్కెట్ మద్దతు లేకపోవడం
- 2005 తరువాత తెలంగాణ హోటళ్లలో సుమారు 80% అరిటాకు వినియోగం నమోదైంది.

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

ఒక గ్రామంలో మోదుగ ఆకు విస్తరి తయారీ ద్వారా 20--30 కుటుంబాలు ఉపాధి పొందేవి. 2025 నాటికి ఈ ఉపాధి అవకాశాలు 90% వరకు క్షీణించాయి. మహిళల స్వయం ఉపాధి తీవ్రంగా దెబ్బతింది. స్థానిక వనరుల ఆర్థిక విలువ తగ్గింది. పేపర్ ప్లేట్లు, థర్మాకోల్ ఉత్పత్తులు, అరిటాకు విస్తరులు మార్కెట్‌ను ఆక్రమించాయి. ఇవి పర్యావరణానికి హానికరమైనవిగా గుర్తించబడ్డాయి. మోదుగ ఆకు విస్తరి పూర్తిగా జీవక్షయం అయ్యే సహజ ఉత్పత్తి.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.